Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 266 మేడ్చల్ మల్కాజ్‌గిరి 15 అక్టోబర్ 2023 ఆదివారం పేజీలు : 4

## జైపూర్ ప్రైవేటు లాకర్లలో 500 కోట్ల నల్లధనం

### కుంభకోణాల సొమ్ము దాచారని బీజేపీ ఎంపీ ఆరోపణ

జైపూర్ : జైపూర్‌లోని ప్రైవేటు లాకర్లలో కోట్లాది రూపాయల నల్లధనం, బంగారాన్ని నిల్వ చేశారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కిరోడీలాల్ మీనా ఆరోపించారు. ఆయన ప్రస్తుతం రాజస్థాన్‌లోని సవాయ్ మాధవ్‌పూర్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు 100 ప్రైవేటు లాకర్లలో రూ.500 కోట్ల నగదు, 50 కిలోల బంగారాన్ని నిల్వ చేశారని చెప్పారు. అయితే అవి ఎవరికి చెందినవన్న విషయాన్ని వెల్లడించలేదు. ఒకవేళ పేర్లు బయటపెడితే రాజకీయ ఒత్తిళ్లు వస్తాయని, అప్పుడు వాటిని తెరిచే అవకాశం ఉండదని చెప్పారు. వాటిని తెరవాలంటూ ఆ లాకర్లు ఉన్న భవనం వద్ద కూర్చొంటానని తెలిపారు

## నామినేషన్ల పర్వానికి ముందే...

# చక్కబెట్టేద్దాం...!



## ప్రచార టార్గెట్ ఫిక్స్ చేసుకున్న కేసీఆర్, హరీష్, కేటీఆర్!

హైదరాబాద్ : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను ముందుగానే ప్రకటించేసిన కేసీఆర్ ప్రచారంలో కూడా ముందుండాలనే అనుకుంటున్నారు. రెండు వారాల అనారోగ్యం నుండి కోలుకున్న కేసీయార్ బహిరంగసభల నిర్వహణలో జెట్ స్పీడుతో వెళ్ళాలని డిసైడ్ అయిపోయారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాకముందే మొత్తం 119 నియోజవర్గాల్లో ప్రచారం పూర్తిచేయాలని అనుకుంటున్నారు. ఇందుకోసం తాను పర్సనల్ గా కొన్ని నియోజకవర్గాలను కవర్ చేయాలని మిగిలిన నియోజకవర్గాలను మంత్రులు హరీష్ రావు, కేటీయార్ తో చేయించాలని డిసైడ్ అయ్యారు. ఇందులో భాగంగానే 17 రోజుల్లో కేసీయార్ 41 బహిరంగ సభల్లో ప్రసంగించడానికి రెడీ అవుతున్నారు. మొదటి విడత ప్రచారంలో 41 నియోజకవర్గాలను కేసీయార్ కవర్ చేయబోతున్నారు. రోజుకు మూడు నియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని పార్టీ ప్లాన్ చేస్తున్నది. కేసీయార్ 17 రోజుల్లో 41 నియోజకవర్గాల్లో ప్రచారానికి ప్లాన్ చేస్తుంటే కాంగ్రెస్, బీజేపీలు ఇంకా అభ్యర్థుల వడపోతలోనే ఉన్నాయి. అభ్యర్థులను ప్రకటిస్తే జరగబోయే గొడవల విషయంలోనే కాంగ్రెస్ బాగా సమయం తీసుకుంటున్నట్లు అర్థమవుతోంది. జరిగే గొడవలు ఎప్పుడైనా తప్పవు కనీసం ఏకగ్రీవమై పోయిన నియోజకవర్గాల్లో అయినా ఎందుకు అభ్యర్థులను ప్రకటించటం లేదో అర్థం కావటం లేదు. దీనివల్ల కాంగ్రెస్ సీనియర్లలో తీవ్ర అసహనం పెరిగిపోతోంది. అయినా అధిష్టానం పట్టించుకోవటంలేదు. ఇక బీజేపీది అయితే వేరే సమస్య. అన్నీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించేందుకు గట్టి నేతలు లేరు. అందుకనే ఇతర పార్టీల్లోని నేతలవైపు చూస్తోంది. బీఆర్ఎస్ లో టికెట్లు ప్రకటించేశారు కాబట్టి అక్కడి నుండి బీజేపీలో చేరే నేతలు పెద్దగా ఉండరు. అందుకనే కాంగ్రెస్ ప్రకటించబోయే అభ్యర్థుల కోసం ఎదురుచూస్తోంది. టికెట్లు దక్కని అసంతృప్త నేతలు బీజేపీలో చేరకపోతారా అప్పుడు వాళ్ళకి టికెట్లిచ్చి నిలబెట్టాలని ఆలోచిస్తోంది. ఈ రెండు పార్టీలు అభ్యర్థుల ప్రకటనకే ఇంత సమయం ఆలోచిస్తుంటే కేసీయార్ తో పాటు హరీష్, కేటీఆర్ బహిరంగసభలకు ప్లాన్ చేస్తున్నారు. కేటీయార్, హరీష్ ఇద్దరు వేర్వేరుగా సుమారు 50 నియోజకవర్గాల్లో పర్యటించాలని, బహిరంగ సభలు నిర్వహించాలని డిసైడ్ చేసుకున్నారు. మొత్తం మీద గెలుపు అవకాశాలను పక్కన పెట్టేస్తే బీఆర్ఎస్ లో అయితే కేసీఆర్, హరీష్, కేటీఆర్ సుడిగాలి ప్రచారానికి రంగం సిద్ధమైపోతోంది.

## ఎన్నికల ఎఫెక్ట్ : హెలికాప్టర్‌లు, చార్టర్డ్ విమానాలకు డిమాండ్!!



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. తెలంగాణ ఎన్నికల షెడ్యూల్ రావడంతో అన్ని ప్రధాన పార్టీలు ప్రచారానికి సిద్ధమవుతున్నాయి. రాష్ట్రమంతా సుడిగాలి పర్యటనలు చేయడానికి రెడీ అవుతున్నాయి. అన్ని రాజకీయ పార్టీల నేతలు వందల సంఖ్యలో ప్రచార సభలను నిర్వహించడానికి సన్నద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో హెలికాప్టర్లు, విమానాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఎన్నికల సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రంలో ప్రచారం చేయడానికి వచ్చే జాతీయ నాయకులకు, స్టార్ క్యాంపెయినర్ లకు సమయాన్ని ఆదా చేయడంతోపాటు, సౌకర్యవంతంగా ప్రయాణం చేయడానికి హెలికాప్టర్లు, చార్టర్డ్ విమానాలను తీసుకోవడానికి ప్రధాన పార్టీల నాయకులు సై అంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో అద్దె విమానాలకు, హెలికాప్టర్ లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలోనూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో త్వరగా ప్రయాణం చేయడం కోసం అద్దె విమానాలను హెలికాప్టర్లను ఆశ్రయిస్తున్నారు. లక్షల్లో అద్దె చెల్లిస్తూ అద్దె విమానాలను బుక్ చేసుకుంటున్నారు రాజకీయ పార్టీల నాయకులు. బ్లేడ్ ఇండియా, జెట్ సెట్ గో, అర్బన్ ఎయిర్ మొబిలిటీ, ఇండియన్ ఫ్లై సర్వీసెస్ వంటి కంపెనీలు హెలికాప్టర్లు జెట్ విమానాలను అద్దెకి ఇస్తున్నాయి . ప్రైవేట్ ఏజెన్సీ లతోపాటు సువిధ యాప్ ద్వారా హెలికాప్టర్లు, విమానాలను అద్దెకి తీసుకోవడానికి ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. సాధారణంగా ఎన్నికల ప్రచారానికి బెల్ 407, ఎయిర్ బస్ హెచ్125, హెచ్ 130 హెలికాప్టర్లను అద్దెకు తీసుకుంటుంటారు. ఈ హెలికాప్టర్లలో ఐదుగురు ప్రయాణం చేయవచ్చు. సాధారణంగా సింగిల్ ఇంజన్ హెలికాప్టర్ అద్దె గంటకు ఒక లక్ష యాభై వేల రూపాయల నుంచి ఉంటుంది. అదే డబుల్ ఇంజన్ అయితే 2 లక్షల 75 వేల రూపాయల వరకు ఉంటుంది. మొత్తంగా అన్ని ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించనున్న నేపథ్యంలో రాబోయే రోజులలో అద్దె హెలికాప్టర్లు, విమానాలకు డిమాండ్ మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. అయితే హెలికాప్టర్ లు, అద్దె విమానాలను ఉపయోగిస్తే ఆ ఖర్చు కూడా ఎన్నికల ఖర్చు క్రిందే పరిగణించి లెక్కిస్తారు.



## రాహుల్ గాంధీతో భేటీ అయిన తుమ్మల

దిల్లీ: ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ పిలుపు మేరకు దిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో తుమ్మల భేటీ అయ్యారు. పార్టీలో చేరిన తర్వాత ఆయన రాహుల్‌తో భేటీ కావడం ఇదే తొలిసారి. పార్టీలో చేరిన రోజు సమయం ఇవ్వలేక పోవడంతో.. అధిష్ఠానం తుమ్మలను పిలిపించినట్లు సమాచారం. ఈ క్రమంలో సుమారు అరగంట పాటు రాహుల్ గాంధీతో తుమ్మల భేటీ అయ్యారు.

రాష్ట్రంలో తాజా పరిస్థితులు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఇరువురు నేతలు కీలక చర్చలు జరిపారు. ఖమ్మం జిల్లాలో పరిస్థితులు, రాజకీయ వ్యూహంపై కూడా చర్చించారు. అదేవిధంగా తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉన్న రాజకీయ పరిస్థితులపై కూడా చర్చించినట్లు సమాచారం.



# టికెట్ వస్తుందో.. రాదో..

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియనే ఇంకా ప్రారంభం కాకపోవడంతో కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు నైరాశ్యంలో మునిగిపోయాయి.

## నోటిఫికేషన్ విడుదలవడంతో ప్రతిపక్షంలో

# పెరుగుతున్న నైరాశ్యం

హైదరాబాద్ : అధికార పార్టీ జోరుకు కాంగ్రెస్, బీజేపీలు కుదేలవుతున్నాయి. ఇప్పటికే అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలో ప్రజల మన్ననలు అందుకుంటున్నది. గ్రేటర్‌లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ అభ్యర్థులు దూసుకుపోతున్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చేందుకు తీసుకున్న చర్యలు.. భవిష్యత్తు ప్రణాళికలను వివరిస్తున్నారు. వీరి ప్రచారం చూస్తున్న ప్రతిపక్ష పార్టీల నాయకులు బెంబేలెత్తిపోతున్నారు. అగ్రనాయకుల తీరుతో ఏం చేయాలో తెలియక ఇంట్లోనే ఓ మూలన కూర్చోవాల్సిన దుస్థితి వచ్చింది. ఇప్పటికీ అభ్యర్థులను ప్రకటించకపోవడంపై ఆ క్యాడర్ అంతా అసహనం వ్యక్తం చేస్తుంది. 'గిట్ల అయితే డిపాజిట్లు కూడా రావు.' అని కాంగ్రెస్, బీజేపీ పార్టీ కార్యకర్తలు తమ నాయకుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిమ్మల్ని నమ్ముకోవడం కంటే అధికార పార్టీ కండువా కప్పుకోవడం మేలని చాలా మంది కార్యకర్తలు ఆలోచిస్తున్నారు. అందులో భాగంగానే బీఆర్ఎస్ పార్టీలోకి గ్రేటర్‌లో ప్రతిపక్షాల నుంచి వలసలు పెరుగుతున్నాయి. ఇదిలా ఉండగా టికెట్ ఆశించే ఆశవాహులు తమ పరిస్థితి క్యాడర్‌కు చెప్పుకోలేక.. ఏం చేయాలో తెలియక రాత్రిల్లు కంటిమీద కునుకు ఉండటం లేదని ఆవేదన చెందుతున్నట్టు సమాచారం.

**హైకమాండ్‌ను ప్రసన్నం చేసుకోవడంపై దృష్టి :** మొన్నటి వరకు టికెట్ తమకే వస్తుందని హడావిడి చేసిన నాయకులు ప్రస్తుతం మొఖం చాటేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల హైకమాండ్ ఢిల్లీతో ముడిపడి ఉండటంతో ఈ సమస్య వస్తుందని వారు చర్చించుకుంటున్నారు. దీంతో ప్రధాన రాజకీయ పార్టీల టికెట్లు ఆశిస్తున్న వారిలో చాలా మంది ప్రచారం విషయంలో ఆలోచనలో పడ్డారు. ఓ రోజు ఒకరికి.. మరో రోజు మరొకరికి వస్తుందని ప్రకటనలు వెలువడుతుండటంతో టికెట్ గ్యారంటీ లేదని ఆశావాహులు తెలిసిన వారి దగ్గర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోనీ ధైర్యం చేసి టికెట్ తమకే అని నియోజకవర్గంలో ప్రచారం మొదలుపెడితే.. అంత ఖర్చు పెట్టినా టికెట్ రాకుంటే ఎలా అంటూ వారంతా హైరానా పడుతున్నారు. ప్రచారం కాదు.. టికెట్ల కోసం హైకమాండ్‌ను ప్రసన్నం చేసుకోవడంపై దృష్టి సారిస్తున్నారు. టికెట్ ప్రకటన ఇలాగే ఆలస్యమైతే డిపాజిట్లు కూడా రావని ప్రతిపక్షాలు గుట్టుగా చర్చించుకుంటున్నాయి.

**ఇదిగో మౌనం ఇలా..** ముషీరాబాద్‌లో దత్తాత్రేయ కూతురు విజయలక్ష్మి ప్రచారం చేసింది. కానీ ఇప్పుడు సైలెంట్ అయిపోయింది. తాజా పరిణామాలతో ప్రచారంలో జోరు తగ్గించారు. జూబ్లీహిల్స్ నుంచి పీజేఆర్ కుమారుడు విష్ణువర్దన్ రెడ్డి ప్రచారం చేసుకున్నాడు. కానీ ఆ స్థానం మరో నేతకు దక్కుతుందనే వార్తలు రావడంతో ఆయన ప్రచారంలో సైలెంట్ అయిపోయారు. క్యాడర్‌ది కూడా అదే దారి. అంబర్‌పేటకు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఆ స్థానానికి పెద్ద ఎత్తున లాబియింగ్ ఉండటంతో ఇప్పుడు అతను ఊసెత్తడం లేదు. కంటోన్మెంట్‌లో మాజీ మంత్రి శంకర్‌రావు కూతురు బరిలో ఉంటానని ఇప్పటికే హడావిడి చేసింది. కానీ ఇప్పుడు ఆమె సైలెంట్ అయిపోయింది. సికింద్రాబాద్ నుంచి సినీ నటి జీవిత బీజేపీ క్యాండిడెట్‌గా దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఆ స్థానంలో స్థానికేతరులు రావొద్దంటూ ఆ పార్టీ నేతలు సపోర్ట్ చేసే పరిస్థితి లేదు. అందులోనూ టికెట్ గ్యారంటీ లేక ఆమె సైలెంట్ అయిపోయారు. అందుకే మూడు, నాలుగు చోట్ల ఆమె కర్చీఫ్ వేసి పెట్టారు. గోషామహల్ నుంచి ఎమ్మెల్యేగా రాజాసింగ్ ఉన్నారు. కానీ పార్టీ అతడిపై సస్పెన్షన్ విధించడంతో ప్రచార బాధ్యతలు వదిలేశాడు. టికెట్ ఎవరికి వస్తుందో తెలియక ఆయన అనుచరులు కూడా సైలెంట్ అయిపోయారు. అన్నా.. మన ప్రచారం ఎప్పుడే. ఇప్పటికే గులాబీ పార్టీ దూసుకుపోతున్నది. గల్లీ గల్లీ చుట్టేస్తుండ్రు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులందరూ ప్రజా క్షేత్రంలో ఉన్నారు. హ్యాట్రిక్ విజయం అందించడానికి ప్రజలు అదే స్థాయిలో వారందరికి పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతుండ్రు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రధాన ఎజెండాగా వారంతా గట్టిగానే తిరుగుతుండ్రు. గిట్లయితే మనం గెలవడం కష్టమే. ఆలస్యమైతే డిపాజిట్లు కూడా రావన్న. తొందరగా ప్రచారం మొదలుపెడుదామే. నువ్వే మా క్యాండెట్. ఢిల్లీవోళ్లు ఏమంటుండ్రు? ఏమంటవు అన్నా.

**– ఇది టికెట్ తమ నాయకుడికే వస్తుందనే ఆశతో ఉన్న క్యాడర్ ఆవేదన**

తమ్మీ నీ బాధ నాకు ఎరుకైతంది. కానీ నా బాధ గీడ ఎవ్వడు ఇంటలేడు. నేను 30 ఏండ్లకు పైగా రాజకీయాల్లో ఉన్నా. గతంలో పలుమార్లు ఎమ్మెల్యేగా ఉన్న. ఎప్పుడు లేని దుస్థితి ఈసారి వచ్చి పడింది. రాత్రి నిద్దురకూడా సక్కగ పడతలే. టికెట్ వస్తదో.. రాదో.. కూడా తెలియని పరిస్థితి నాది. మనం అనుకుంటున్న నియోజకవర్గం నుంచి పోటీచేసేది నేనా.. కాదా..? అనే విషయం కూడా నాకు క్లారిటీ లేదు. మొన్నటి వరకు నా వెంట తిరిగినోళ్లే నాకన్న ఎక్కువగా హై కమాండ్ వద్ద లాబియింగ్ చేస్తుండ్రు. టికెట్ ఇవ్వాల్సిందేనని గట్టిగానే కూసుండ్రు. ఇలాంటి పరిస్థితుల్లో ఆగమాగమవ్వడం ఎందుకు తమ్మీ.. చూద్దాం.. ఏం జరుగుతుందో%ా% ప్రచారం మొదలుపెట్టాక టికెట్ రాకపోతే ఇజ్జత్ పోదా తమ్మీ.. **– ఇది కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న ఓ ముఖ్య నేత పరిస్థితి**

# సంపాదకీయం

## ఐక్య రాజ్యసమితి పాత్ర ఏమిటి యుద్ధం శరణం గత్యామీ !

ప్రపంచ దేశాలు ఇపుడు అశాంతి యుద్ధం నడుమ చిక్కుకుని పోతున్నాయి. ఏ దేశానికి కోపం వస్తే ఆ దేశం ఆయుధం పడుతోంది. పక్కన ఉన్న దేశం చిన్నదా పెద్దదా అన్నది చూడడంలేదు. మారణ హోమమే రగులుకుంటోంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఏర్పటైన సంస్థ ఇది. ప్రపంచ దేశాలు ఏర్పాటు చేసుకున్న సంస్థ. అది సరిగ్గా 1945 అక్టోబర్ 24న ఏర్పాటు అయింది. అంటే మరో 22 ఏళ్లలో వందేళ్ళు పూర్తి అవుతాయన్న మాట. ఐక్య రాజ్య సమితి ఆవిర్భావం వెనక ఉద్దేశ్యాలు ఏంటి అన్నది చూస్తే కనుక అంతర్జాతీయ చట్టాలను పరిరక్షించడం, అలాగే ప్రపచభద్రత, ప్రపచ ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి ప్రపంచ మానవ హక్కులపై సమిష్టిగా కృషి చేయడం వంటి ఎన్నో లక్ష్యాలు ఉన్నాయి. ఇలా ప్రపంచ దేశాలకు ఒక మధ్యవర్తిగా పెద్ద మనిషిగా ఏర్పాటు అయిన ఐక్య రాజ్యసమితి లో ఈ రోజుకు చూస్తే 193 దేశాలు ఉన్నాయి. ఐక్యరాజ్య సమితిలో ప్రవేశించిన అన్ని దేశాలకు సభ్యత్వం ఉండగా, భద్రతామండలిలో 15 దేశాలకు మాత్రమే సభ్యత్వం ఉంటుంది. ఇలా ప్రపంచం అంతా ఐక్య రాజ్యసమితి గొడుగు నీడకు వచ్చిన తరువాత అనుకున్న లక్ష్యాలు నెరవేరుతున్నాయా అన్న చర్చ అయితే వస్తోంది. గత ఏడాది ఫిబ్రవరిలో రష్యా ఉక్రెయిన్ యుద్ధం మొదలైంది. ఇప్పటికీ ఆగకుండా సాగుతూనే ఉంది. ఐక్య రాజ్యసమితి మధ్యవర్తిత్వం చేసినా కూడా యుద్ధం ఆగలేదు. ఇపుడు చూస్తే ఇజ్రాయెల్ హమాస్ అనే ఉగ్ర సంస్థతో పోరాడుతోంది. హమాస్ వెనక పాలస్తీనా ఉంది. ఇలా రెండు దేశాల మధ్య గత ఎనభై ఏళ్ళుగా యుద్ధం రావణ కాష్టంగా సాగుతున్నా ఐక్య రాజ్యసమితి ఏ రాజీనీ కుదర్చలేకపోయింది అనే అంటున్నారు. భారత్ విషయానికి వస్తే కాశ్మీర్ ఇష్యూ ఏడున్నర దశాబ్దాలుగా పాకిస్థాన్ ఇండియా మధ్య రగులుతూనే ఉంది. తొలి ప్రధాని నెహ్రూ మూడవ వంతు భూభాగం కాశ్మీర్ కి చెందినది పాక్ ఆక్రమించినది అని ఐక్య రాజ్య సమితి ఫిర్యాదు చేశారు. ఈ రోజుకీ ఆ భూభాగం పాకిస్తాన్ వద్దనే ఉంది. భారత్ ప్రచ్ఛన్న యుద్ధంతో ఉగ్ర పోరుతో ఎంతో నష్టపోయింది. కాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దు చేసి భారత్ లో కలుపుకున్నా పాకిస్తాన్ కాశ్మీర్ మీదనే ఐక్య రాజ్య సమితిలో ప్రసంగాలు చేస్తూనే ఉంటుంది. అయినా అక్కడ పాక్ నోరు మూసే వారు ఉన్నారా అన్న ప్రశ్నలు ఉదయిస్తూంటాయి. అలాగే చైనా అనేక సరిహద్దు దేశాలను వాటి భూభాగాలను కబలిస్తూంటే పెద్దన్నగా రెచ్చిపోతూంటే ఐక్యరాజ్య సమితి పాత్ర ఏమిటి అన్న చర్చ వస్తూనే ఉంది. భారత్ లోని టిబెట్ ని ఆక్రమించి కీలకమైన సరిహద్దు భూ భాగాలను తన మ్యాప్ లో చూపిస్తూ మరికొంత కలిపేసుకుంటూ చైనా చేస్తున్న ఆగడాలకు ప్రపంచ మధ్యవర్తి ఏ రకంగా ముకుతాడు వేసింది అంటే జవాబు చూడాల్సి ఉంది. అమెరికా పెద్దరికాన్ని పెత్తందారీ పోకడలను కూడా ఇతర దేశాలు ఒకపుడు సహించలేని పరిస్థితి ఉంటే అనేక దేశాల వ్యవహారాలలో పెద్దన్న జోక్యం చేసుకున్నా ఐక్య రాజ్యసమితి నుంచి ఏ పాటి ఉపశమనం లభించింది అన్నది కూడా కీలకమైన మౌలికమైన ప్రశ్నగానే చూస్తారు. ఉత్తర కొరియా తన చిత్తం వచ్చిన తీరున వ్యవహరిస్తున్నా ప్రపంచం అణు గుప్పిట ఉన్నా అందరికీ సహనం నేర్పి కలిపి ఉంచే కీలక పాత్రలో ఉన్న ఐక్య రాజ్య సమితి ఇపుడు తన పాత్రను పూర్తి స్థాయిలో నిర్వహిస్తోందా అన్నదే చర్చ. ఇంతకీ ఈ ఐక్య రాజ్య సమితి ఎలా ఏర్పడింది అంటే నానా జాతి సమితి ప్లేస్ లో అని చరిత్ర చెబుతోంది. నాడు మొదటి ప్రపంచ యుద్ధాన్ని నివారించలేక నానా జాతి సమితి విఫలం అయింది. ఆ మీదట రెండవ ప్రపంచ యుద్ధం జరిగిపోయింది. అపుడు ఐక్య రాజ్య సమితి ఏర్పాటు అయింది. ఐక్య రాజ్య సమితి ఏపాటు అయ్యాక మూడవ ప్రపంచ యుద్ధం అయితే జరగలేదు కానీ అనేక దేశాల మధ్య యుద్ధాలు జరిగాయి వాటికి మద్దతుగా పరోక్షంగా ఇతర దేశాలు అన్నీ ఉన్నాయి. అంటే ఇది ఇండైరెక్ట్ గా ప్రపంచం మూడవ ప్రపంచ యుద్ధం లో ఉన్నట్లే అంటున్నారు. లేటెస్ట్ గా ఇజ్రాయెల్ హమాస్ మధ్య యుద్ధంలో కూడా ఐక్య రాజ్య సమితి శాంతి వచనాలు చెబుతోంది అని విమర్శలు ఉన్నాయి. ఇజ్రాయిల్ వరుస బాంబు దాడులతో గాజాను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆదివారం అత్యవసరంగా సమావేశమైంది, కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. ఐక్యరాజ్య సమితిలో రష్యా రాయబారి వాసిలీ నెబెంజియా మాట్లాడుతూ తక్షణమే కాల్పుల విరమణ జరగాలని కోరారు. అర్ధవంతమైన చర్చలు జరగాలన్నారు. దశాబ్దాల తరబడి ఇలాంటి చర్చలు లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఎదురైందన్నారు. చైనా రాయబారి ఝాంగ్ జున్ కూడా రెండు దేశాల ఏర్పాటే ఈ సమస్యకు పరిష్కారమని స్పష్టం చేశారు. ఏది ఏమైనా ఈ రోజు ప్రపంచం యుద్ధం అంచులలో ఉంది. యుద్ధం శరణం అంటోంది. మరి ఈ ప్రపంచంలో అందరి వద్దా అణు వస్త్రాలు ఉన్నాయి. ఎవరి మాట ఎవరూ వినే పరిస్థితి లేదు. ఎవరికి కోపం వచ్చినా ఈ భూమి సర్వనాశనం కావడం ఖాయం. మరి ఐక్య రాజ్యసమితి క్రియాశీలంగా వ్యవహరించాలన్నది శాంతి కాముకుల మాట. అది నెరవేరుతుందో లేదో చూడాల్సి ఉంది.

# ఉన్నత విద్యకు బాసట



భూపాలపల్లి : కార్పొరేట్ కళాశాలలకు దీటుగా సదుపాయాలు.. నిపుణులైన అధ్యాపకుల బోధన.. నాణ్యమైన భోజనం.. వసతి సౌకర్యాలతో గురుకులాలు పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నాయి. ఉచితంగా ఇంటర్, డిగ్రీ విద్యను అందిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునేలా తోడ్పాటునందిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మహాత్మా జ్యోతిబా ఫులే బీసీ గురుకుల పాఠశాలలు/కళాశాలల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి తీవ్ర పోటీ నెలకొంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు పాఠశాల స్థాయి చదువులతో పాటు ఇంటర్, డిగ్రీ విద్యను ఉచితంగా అభ్యసించేందుకు ప్రవేశాలు పొందేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. తాజాగా ఇంటర్, డిగ్రీలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఇటీవల ప్రకటన జారీ చేసింది. ఈ నెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీగా నిర్ణయించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాలో మహాత్మా జ్యోతిబా పులే బీసీ గురుకుల జూనియర్ కళాశాలలు బాలురకు 17, బాలికలకు 18 వరకు ఉన్నాయి. బాలికలకు 1620, బాలురకు 1420 వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా రెండు బీసీ డిగ్రీ గురుకుల విద్యాలయాలు, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని పెంబర్తిలో బాలికలకు, పాలకుర్తిలో బాలురకు ఏర్పాటు చేశారు. ఇందులో బాలికలకు 320, బాలికలకు 320 సీట్లు ఖాళీగా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లా లింగాల క్రాస్‌రోడ్డు, రేగొండ, మొగుళ్లపల్లి, భూపాలపల్లి బీసీ గురుకుల పాఠశాలలుండగా ప్రభుత్వం కొత్తగా ఈ విద్యా సంవత్సరంలో రేగొండ, భూపాలపల్లిలో బీసీ గురుకుల జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసింది. ఇందులో వివిధ గ్రూపుల్లో 320 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ములుగు జిల్లాలో ఆరేపెల్లి, మొగుళ్లపల్లి, మంగపేటలో మూడు బీసీ గురుకుల జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో 160 సీట్లు ఉన్నాయి. జనగామ జిల్లాలో కరుణాపురంలో రెండు, పెంబర్తి, జనగాం, రాయపర్తి, మొండ్రాయి ప్రాంతంలో మొత్తం ఆరు బీసీ గురుకుల జూనియర్ కళాశాలలున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో మరిపెడ, ప్రతిపాకరోడ్, గూడూరు, తొర్రూరు, దంతాలపల్లి, కేసముద్రం మొత్తం ఆరు జూనియర్ కళాశాలలున్నాయి. వరంగల్ జిల్లాలో ఖనాపూర్, గిర్నిబావి, ఓగ్లాపూర్, ఉర్సుగుట్ట, మామునూర్, ఎల్లాపూర్‌లో రెండు, నర్సంపేటలో 8 వరకు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో శాయంపేట, గుడేప్పాడ్ క్రాస్ రోడ్డు, జయగిరి, ఖాజిపేట, ఉప్పరపల్లి క్రాస్‌రోడ్డు, కమలాపూర్‌లో రెండు, ఎల్లాపూర్‌లో మొత్తం 8 జూనియర్ కళాశాలలున్నాయి.

మెరుగైన విద్య అందిస్తాం

–రాంరెడ్డి, ప్రాంతీయ సమన్వయ అధికారి

మహాత్మా జ్యోతిబా ఫులే గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్యతో పాటు భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నాం. గత విద్యా సంవత్సరంలో వీటిల్లో ఇంటర్ చదివిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. జిల్లాలోని అర్హులైన పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొంది సద్వినియోగం చేసుకోవాలి.

16 వరకు తుది గడువుమహాత్మాజ్యోతిబా ఫులే బీసీ గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు ఉంది. ఇందుకోసం రూ.200 రుసుం చెల్లించాలి. ఇదే నెల 29న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. బీసీలకు 70 శాతం, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, ఇతరులకు 30 శాతం సీట్లను కేటాయిస్తారు.

# భక్తుల కానుకలు భద్రమేనా.?



వరంగల్ : ఇటీవల సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో భక్తులు సమర్పించిన బంగారు ఆభరణాలకు రసీదు ఇవ్వలేదు. గతంలో ఉజ్జయినీ మహంకాళి ఆలయం, ఇతర ఆలయాల్లోనూ ఈవోలపై కేసులు నమోదయ్యాయి. ఇలాంటి ఘటనలు వరంగల్ ఉమ్మడి జిల్లాలోని కొన్ని ఆలయాల్లోనూ వెలుగు చూశాయి. ఐనవోలు, వరంగల్ బాలానగర శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు సమర్పించిన బంగారు, వెండి వస్తువుల్లో తేడాలొచ్చాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా పలు దేవాలయాల్లో బంగారం, వెండి ఆభరణాలకు రసీదులు ఇచ్చే విధానం అమలు కావడం లేదు.. దేవాదాయ శాఖలో ఉద్యోగుల కొరత ఉండడంతో సీనియర్ ఈవోలకు అదనపు ఆలయాల బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో భక్తులు సమర్పించే కానుకల విషయంలో పారదర్శకత ఉండటంలేదనే విమర్శలున్నాయి.

నిబంధనలు ఇవీ..

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో పనిచేస్తున్న దేవాలయాల్లో బంగారు, వెండి ఆభరణాలు, ఇతర వస్తువుల నమోదు తప్పనిసరి. ఆలయం పేరుతో రసీదు పుస్తకాలు ముద్రించాలి. భక్తులు ఇచ్చే ప్రతి కానుకకు రసీదు ఇవ్వాలి. ధర్మ కాంటా ఆధారంగా తూకం లెక్కలు రాసి ఇస్తారు. వెంటనే వివరాలు ఇన్వెంటర్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి.

10 గ్రాములు దాటే బంగారం, వెండి ఆభరణం, ఇతర వస్తువులకు రసీదు ఇవ్వాల్సిందే. చిన్నవి వస్తే హుండీలో వేయాలి.

రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లో బంగారం, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులను ప్రతి ఆర్నెల్లకోసారి రాష్ట్ర దేవాదాయ శాఖ తరఫున ఆభరణాల తనిఖీ అధికారి(జ్యువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్– జేవీవో) తనిఖీ చేయాలి. ఇన్వెంటరీ పుస్తకాన్ని పరిశీలిస్తారు.

దేవుళ్ల అలంకరణ కోసం పూజారులకు ఇచ్చే బంగారం, వెండి వస్తువుల వివరాలు ఆలయ అధికారిక పుస్తకంలో నమోదు చేయాలి.

బంగారం, వెండి వస్తువులకు బీమా చేయించాలి. దొంగలు ఎత్తుకెళ్లినప్పుడు ఇది వర్తిస్తుంది.

దేవాలయాల్లో భక్తులు ఎవరైనా బంగారం, వెండి అందజేస్తే రసీదు తీసుకొవాలి. లేకపోతే సిబ్బందిని అడగాలి.

భద్రకాళి ఆలయంలో భద్రంగా..

శ్రీభద్రకాళి దేవాలయంలో భక్తులు సమర్పించే బంగారు, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులకు రసీదు ఇస్తారు. జాబితా పుస్తకంలో నమోదు చేస్తారు.

10 గ్రాములు దాటిన ఆభరణాలు, వస్తువులకు రసీదు ఇస్తున్నారు. చిన్న వస్తువులైతే హుండీలో వేయిస్తున్నారు.

ఐదేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జటామకుటాలు హనుమకొండలోని యూనియన్ బ్యాంకు లాకర్‌లో పెట్టారు. ప్రతి ఏడాది శ్రీదేవి శరన్నవరాత్రుల సమయంలో బయటకు తీసేటప్పుడు, తిరిగి లాకర్‌లో పెట్టే ముందు తూకం వేస్తారు.

ఏడాదిలో రెండుసార్లు రాష్ట్ర దేవాదాయ శాఖ జ్యువెలరీ అధికారి పరిశీలన చేస్తారు.

భద్రకాళి దేవస్థానం ఎస్బీఐ గోల్డ్ బాండ్ స్కీంలో చేరింది.

బంగారం, వెండి బ్యాంకులో డిపాజిట్ చేసినందుకు ఏటా వడ్డీ రూపేణా ఆదాయం వస్తుంది.

కొన్ని ఉదాహరణలు

గతేడాది ఆగస్టు, సెప్టెంబరులో హనుమకొండ జిల్లాలోని ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి దేవాలయంలో ఈవో, ఉద్యోగులకు తెలియకుండా ఓ అర్చకుడు బంగారు ఆభరణం చేయిస్తానని భక్తుడి నుంచి నగదు తీసుకున్నారు. ఆభరణం తూకంలో తేడా రావడంతో సదరు భక్తుడు ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖాధికారులు విచారణ చేసి అర్చకుడిని సస్పెండ్ చేశారు.

వరంగల్ బాలానగర శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో రెండేళ్ల కిందట స్వామి వారికి భక్తుడు సమర్పించిన బంగారం, వెండి వస్తువులు కనిపించ లేదని తెలిసింది. ఇద్దరు ఈవోల మధ్య ఏర్పడిన వివాదం ఇంకా పూర్తవ్వలేదు. వస్తువుల మాయం మిస్టరీ వీడలేదు.

వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని పలు దేవాలయాల్లో అనధికారికంగా అర్చకులు భక్తుల నుంచి నగదు తీసుకుంటున్నారు. దేవుడికి నగలు, ఇతర వస్తువుల పేరుతో వసూలు చేసిన సొమ్ము స్వాహా చేస్తున్నారు.

వారాంతపు రద్దీ ఉండే ఆలయాల్లో ఈవోలు, అర్చకులు ఒక్కటై బంగారు, వెండి వస్తువులకు రసీదులు ఇవ్వడం లేదు.

మహబూబాబాద్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఓ దేవాలయంలో భక్తులు ఇచ్చిన బంగారం, వెండి వస్తువుల వివరాలు సరిగ్గా లేవని తెలిసింది.

భక్తులు రసీదు అడగాలి

– రామల సునీత, సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ వరంగల్ ఉమ్మడి జిల్లా

దేవుళ్లకు మొక్కులు చెల్లించేందుకు బంగారు, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులు ఇచ్చాక దేవస్థానం సిబ్బందిని రసీదు అడగాలి. అది ఉంటేనే ఆభరణం దేవుడి పేరు మీదు జమ అవుతుంది. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం దేవాలయాల్లో బంగారు, వెండి వస్తువుల రసీదు పుస్తకాలు ముద్రించాలి. భక్తులు ఇచ్చిన కానుకకు ధర్మ కాంటా వేయించి, తూకం ప్రకారం తగిన రశీదు ఇవ్వాల్సిందే. తర్వాత జాబితా పుస్తకంలో నమోదు చేయాలి. ఈ విధానం ఈవోలందరూ అమలు చేయాలి. లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

# క్రీడా ప్రాంగణాల్లో పరికరాల్లేవ్!

జగిత్యాల :గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలను ఆటల వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణా లను ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. గ్రామపంచాయతీల్లో స్థల కొరతతో ఊరికి దూరంగా ఏర్పాటు చేశారు. పిల్లలకు ఆడుకునేం దుకు సరైన ఆట వస్తువులు ఏర్పాటు చేయలేదు. కేవలం బోర్డులు ఏర్పాటు చేసి హడావుడిగా ప్రారంభించి తర్వాత పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. కొన్ని చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, పల్లె ప్రకృతి వనాల్లో, పాఠశాలల్లో ఏర్పాటుచే శారు. ఈ నేపథ్యంలో జిల్లాలో బృందం క్రీడా ప్రాంగణాలను పరిశీలించింది. ఆ వివరాలు..

అలంకారప్రాయమే..

మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఒక్కో క్రీడా ప్రాంగణానికి స్థలాన్ని బట్టి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల ఖర్చుతో నిర్మించారు. యామాపూర్, తిమ్మాపూర్ తండా, వేములకుర్తి గ్రామాల్లో పాఠశాలల ఆవరణలోనే అధికారులు క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణాల్లో ఖోఖో, వాలీబాల్, లాంగ్‌జంప్, పుష్‌అప్స్ తీయడానికి స్తంభాలను ఏర్పాటు చేయగా, అవి అలంకార ప్రాయంగానే ఉంటున్నాయి. ఆయా ప్రాంగణాల్లో వాలీబాల్ ఆడడానికి నెట్ అందుబాటులో లేకపోవడంతో పాటు, అన్ని ఆటలు ఆడకపోవడంతో స్తంభాలు నిరుపయోగంగా ఉంటున్నాయనే ప్రజలు వాపోతున్నారు.

అరకొర వసతులు

మల్లాపూర్ మండలంలోని 23 గ్రామపంచాయతీల పరిధిలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల్లో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రాంగణాల్లో సగానికిపైగా ప్రభుత్వ పాఠశాలల్లోనే ఏర్పాటు చేశారు. ఒక్కో ప్రాంగణానికి రూ.4 లక్షల ఈజీఎస్ నిధులను వెచ్చించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రాంగణాలకు అందుబాటు లో క్రీడా వస్తువులు లేకపోవడంతో ఆటలు ఆడుకునేందుకు ఇబ్బందు లు పడుతున్నారు. పలుచోట్ల షటిల్, వాలీబాల్ నెట్లను కట్టలేదు. ఉదయం, సాయంత్రం క్రీడాకారులు వినియోగించేలా ఆటవస్తువులు ఉంచితే క్రీడాకారులకు సౌకర్యంగా ఉంటుంది. ఈ విషయమై ఈజీఎస్ ఏపీవో సతీష్‌ను సంప్రదించగా ఆటలు ఆడుకునే క్రీడాకారులు పంచా యతీ కార్యాలయానికి వెళ్లి తమకు అవసరమైన క్రీడా వస్తువులను తీసుకోవచ్చని, తిరిగి అప్పగించే బాధ్యత వారిపైనే ఉంటుందన్నారు.

మొక్కుబడిగానే..

మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు మొక్కుబడిగా ఏర్పాటు చేశారు. 23 గ్రామ పంచాయతీల్లో 26 క్రీడా ప్రాంగణాలకు రూ.18.92 లక్షలు వెచ్చించారు. ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. చాలా వరకు ధాన్యం పోసే స్థలాలు, క్రీడా ప్రాంగణాల స్థలాలు ఒక్కటే కావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పలు చోట్ల పిచ్చిమొక్కలు, రాళ్లు దర్శనమిచ్చి ఆటలు ఆడుకోవడానికి అనువుగా లేవు. కొంత మొరం పోసి మట్టి చదును చేసి బోర్డులు ఏర్పాటు చేసి ఇనుపరాడ్లు పాతేసి మమ అనిపించారన్న విమర్శలున్నాయి. ఈ విషయమై మెట్‌పల్లి ఎంపీడీవో భీమేష్‌రెడ్డిని సంప్రదించగా, కోతుల బెడదతో యువకులు ఆడుకునేపుడు నెట్లు బిగిస్తున్నారన్నారు. క్రీడా ప్రాంగణాలను ఎప్పటిక పుడు శుభ్రం చేసి ఆటలు ఆడేందుకు అనువుగా ఉండేలా చూస్తున్నామన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో..గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించే ందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణాలు కేవలం లక్ష్యం కోసం ఏర్పాటు చేస్తున్నట్లుగా ఉంది. సారంగాపూర్ మండలంలో 18 గ్రామాలు ఉండగా ఇప్పటికే 16 గ్రామాల్లో వీటిని ఏర్పాటు పూర్తి చేయగా, పోచంపేటలో స్థల సమస్యతో పనులు ప్రారంభం కాలేదు. మిగతా భీంరెడ్డిగూడెంలో పరికరాలు బిగించాల్సి ఉంది. స్థల సమస్యతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, అరకొర వసతుల మధ్య ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.64 వేల నుంచి రూ.లక్ష వరకు వ్యయం చేస్తున్నారు. ఇందులో క్రీడా ప్రాంగణ బోర్డు, వాలీబాల్ కోర్టు, ఖోఖో, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసి వదిలేస్తున్నారు. బీర్‌పూర్ మండలంలో 15 గ్రామాలు ఉండగా అన్ని గ్రామాలతోపాటు మరో నాలుగు అనుబంధ గ్రామాల్లోనూ ఏర్పాటు చేశారు.

90 శాతం పూర్తి...రాయికల్ మండలంలో 32 గ్రామపంచాయతీలు ఉండగా ప్రతి గ్రామానికి క్రీడా ప్రాంగణం మంజూరు చేశారు. ఒక్కో గ్రామంలో సుమారు రూ.4.20 లక్షల నుంచి రూ.7.80 లక్షల వరకు నిధులు ఉపాధి హామీ ద్వారా మంజూరు చేశారు. గ్రామాల్లో 90 శాతం మేరకు మాత్రమే పనులు పూర్తయ్యాయి. అత్యధిక గ్రామాల్లో స్థల కొరతతో క్రీడా ప్రాంగణాల్లో పూర్తిస్థాయి క్రీడా పరికరాలను బిగించలేదు. క్రీడా ప్రాంగణాల్లో భూమిని చదును చేసి సింగిల్ బార్, డబుల్ బార్‌లను మాత్రమే ఏర్పాటు చేశారు. వసతులు లేకుంటే గ్రామస్థులకు వినియోగకరంగా కాకుండా క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మిగిలే అవకాశం ఉంది.

నిర్వహణ గాలికి..

కోరుట్ల మండలంలో 15 గ్రామాలకు గానూ 14 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను పూర్తి చేశారు. మాదాపూర్ గ్రామంలో క్రీడా ప్రాంగణ పనులు పూర్తి కావాల్సి ఉంది. గ్రామాల్లో స్థలాల కొరతతో ఇష్టారీతిన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నారు. స్వాగత తోరణం ఏర్పాటు చేసి వాలీబాల్ కోర్టు కోసం ఇరువైపులా స్తంభాలు, వ్యాయామ బార్లు పాతి నిర్వహణ గాలి కొదిలేశారు. క్రీడా ప్రాంగణ స్థలాన్ని బట్టి ఒక్కో దానికి రూ.1.60 లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ బిల్లులు వసూలు చేశారు. నిబంధనల ప్రకారమే బిల్లులు చెల్లించడం జరిగిందని, నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఎంపీవో మమత తెలిపారు.

# కేజీబీవీ విద్యార్థినులకు ఊరట

కరీంనగర్ : గత కొంతకాలంగా కాస్మొటిక్ ఛార్జీల కోసం ఎదురు చూస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కేజీబీవీ విద్యార్థినులకు కొంత ఊరట లభించింది. గతంలో ఆరోగ్య కిట్లను అందించిన ప్రభుత్వం మూడేళ్లుగా వాటిని ఇవ్వడంలేదు. వీటి స్థానంలో ప్రతి నెల డబ్బులు చెల్లిస్తామని ఈ విద్యాసంవత్సరంలో చెప్పినా.. అమలుకు నోచుకోలేదు. విద్యాసంవత్సరం ముగింపు దశలో మూడు నెలల కాస్మొటిక్ ఛార్జీలను మంజూరు చేస్తూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

నెలకు రూ.100 చొప్పున...

ఉమ్మడి జిల్లాలోని 49 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలున్నాయి. వీటిలో ప్రస్తుతం 10,781 మంది చదువుతున్నారు. నిరుపేదలు, తల్లి, తండ్రిలేని వారు, చదువు మధ్యలో మానేసిన బాలికలు ఉన్న వీటిలో ఉచిత విద్యతోపాటు వసతి, భోజనం తదితర సౌకర్యాలను ప్రభుత్వమే కల్పిస్తోంది. 6–10వ తరగతి వరకు, కొన్నింట్లో ఇంటర్ వరకు విద్య అందిస్తున్నారు. పుస్తకాలు, దుస్తులు, దుప్పట్లు వంటి వాటిని ఉచితంగా సమకూరుస్తున్నారు. గతంలో ప్రతి నెల కాస్మొటిక్ ఛార్జీల కింద నెలకు రూ.100 చొప్పున అందించారు. వాటి స్థానంలో బాలికలకు ఆరోగ్య కిట్ల పేరుతో పలు రకాల వస్తువులను 2019–20 వరకు అందించడంతో వారికి ప్రయోజనంగా నిల్చింది. ఆ తర్వాత వాటిని అందించకపోవడంతో పేద కుటుంబాల బాలికలు సబ్బులు, నూనెలు వంటి వాటిని కొనుక్కునేందుకు ఇబ్బందిపడ్డారు. విద్యాసంవత్సరం ఆరంభంలో ఛార్జీలు చెల్లిస్తామని బ్యాంకు ఖాతాలను సేకరించినా.. డబ్బులు జమ కాలేదు. విద్యాసంవత్సరం ముగింపు దశకు చేరుకున్న క్రమంలో ఒక్కో విద్యార్థినికి నెలకు రూ.100 చొప్పున డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలలకు రూ.300 అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఉమ్మడి జిల్లాకు రూ.30,13,900 మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# ఆమే నిర్ణేత

వరంగల్ : ఈసారి శాసనసభ ఎన్నికల్లో జిల్లా పరిధిలోని అభ్యర్థుల భవితవ్యం తేల్చేది మహిళా ఓటర్లే. జయాపజయాలు నిర్ణయించేది వారి ఓట్లే. వరంగల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఈ నెల 4న విడుదల చేసిన తుది ఓటరు జాబితా ప్రకారం మొత్తం 7,33,454 మంది ఓటర్లు ఉండగా.. అందులో మహిళా ఓటర్లే 3,72,181 మంది ఉన్నారు. అంటే సగానికి పైగా వారే. నర్సంపేట నియోజక వర్గంలో 1,14,742 మంది, వరంగల్ తూర్పులో 1,25,621 మంది, వర్ధన్నపేటలో 1,31,818 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. గత ఆగస్టులో విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో 3,63,567 మంది మహిళా ఓటర్లు ఉండగా.. తుది జాబితాలో 8,614 మంది కొత్త ఓటర్లుగా నమోదయ్యారు.

ఆకట్టుకునే ప్రయత్నాలు..ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లే గెలుపోట ములను నిర్ణయించే అవకాశాలుండటంతో వారిని ఆకట్టుకునేందుకు వివిధ పార్టీల నాయకులు సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వారికి తాయిలాలు, కానుకలు ఇవ్వడం ద్వారా తమవైపు తిప్పుకోవాలని చూస్తున్నారు. ఎన్నికలకు ఇంకా 50 రోజులు మాత్రమే మిగిలి ఉ ండటంతో ఇప్పటికే కొన్ని పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. వారు ఓటర్లలోకి వెళ్లడానికి తగిన ప్రణాళికలు రూపొందించు కుంటున్నారు. అభ్యర్థులను ప్రకటించని స్థానాల్లో టికెట్ ఆశిస్తున్న నేతలు కూడా ఎవరి ప్రయత్నాల్లో వారు ఉంటూనే అంతర్గత ప్రచారాలు సైతం మొదలు పెట్టారు. దసరా సందర్భంగా భారాస నాయకులు, ప్రజాప్రతినిధులు బతుకమ్మ చీరల పంపిణీతో మహిళలను తమవైపు తిప్పుకోవాలని ప్రయత్నించారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మిగిలిన చీరలను అధికారులకు పంపిణీ చేస్తున్నారు.వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 246282 మంది ఉండగా.. 1,25,621 మంది మహిళలే ఉన్నారు. రెండు మండలాల్లోనే ఆధిపత్యం వారిది.

వర్ధన్నపేట నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 260,555 ఉండగా... అందులో మహిళలు 131818 మంది ఉన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం మహిళా ఓటర్ల సంఖ్య 21,884 పెరిగింది. దాదాపు నియోజకవర్గ పరిధిలోకి వచ్చే ఎనిమిది మండలాల ఓటర్లలో మహిళలే అధికంగా ఉన్నారు.

నర్సంపేట నియోజకవర్గంలో ఆరు ఉండలాలు ఉండగా.. మొత్తం ఓటర్లు 2,22,617 మంది ఉన్నారు. అందులో మహిళా ఓటర్లు 1,14,742. అన్ని మండలాల్లో మహిళా ఓటర్లదే ఆధిపత్యం.

ఓటుతోనే మార్పు..- నకరకంటి నందిని, ఐనవోలు

మొదటి సారి ఓటుహక్కు రావడం సంతోషంగా ఉంది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సామాజిక మార్పు కోసం వినియోగించుకోవాలి. సరైన నాయకుడిని ఎన్నుకుంటేనే సత్ఫలితాలు వస్తాయి. అసమర్థులను ఎన్నుకుంటే అభివృద్ధి కుంటుపడుతుంది. మార్పు అనేది ప్రతి ఒక్కరితో ప్రారంభం కావాలి. మహిళల అభివృద్ధికి పనిచేసే నాయకుడికే ఓటు వేస్తా. గ్రామీణ మహిళలు, యువత ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేసే వ్యక్తినే ఎన్నుకుంటా.

ఓటు రావడం ఆనందంగా ఉంది..- గంగాపురం రమ్య, సర్వాపురం (నర్సంపేట)

నేను డిగ్రీ పూర్తి చేశాను. ఓటుహక్కు కోసం కిందటి నెలలోనే దరఖాస్తు చేసుకున్నా. ఓటుహక్కు కల్పిస్తూ జాబితాలో పేరు వచ్చింది. తొలిసారి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం రావడం ఆనందంగా ఉ ంది. పేదరిక నిర్మూలన, నిరుద్యోగ సమస్యను పరిష్కరించే పార్టీ, నిస్వార్థంగా ప్రజల కోసం పని చేసే నాయకుడికే ఓటు వేస్తా.

తొలిసారి వేయబోతున్నా..- ఒ.ఇందు, కాశీబుగ్గ

గతేడాది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నా. ఈసారి ఎన్నికల్లో తొలిసారిగా ఓటుహక్కు వినియోగించుకోవడం కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఓటు ఉన్న ప్రతిఒక్కరు పోలింగ్ రోజు ఓటుహక్కు వినియోగించుకోవాలి. నిష్పక్షపాతంగా పనిచేసే వారికి ఓటు వేయడంలో ఓటర్లు ముందంజలో ఉండాలి.

జిల్లా ప్రగతికి పాటుపడే వారికి..- పి.శ్రావ్య, కోటిలింగాల రోడ్, కాశీబుగ్గరాష్ట్ర, జిల్లా ప్రగతి కోసం పాటుపడే పార్టీ అభ్యర్థులకే ఎన్నికల్లో నా తొలి ఓటును వినియోగిస్తా. ముఖ్యంగా యువత బాధ్యత గల పౌరుడిగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి. గత ఆగస్టులో ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకున్నాను. స్థానిక బీఎల్వో ఫోన్ ద్వారా వివరాలు తీసుకున్నారు. రెండు మూడు రోజుల్లో ఓటరు కార్డు నేరుగా ఇంటికే వస్తుందని చెప్పారు.

## తగ్గిన వాహన రిజిస్ట్రేషన్లు

సిరిసిల్ల : ఎలక్ట్రిక్ వాహనాల రాకతో మోటార్ సైకిల్ వాహనాలతో పాటు ఇతర వాహనాల రిజిస్ట్రేషన్లు తగ్గాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే రవాణాశాఖ కార్యాలయం వద్ద సందడి తగ్గింది. గతంలో రోజూ 40 నుంచి 45 వాహనాలు రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి రాగా ప్రస్తుతం 15 నుంచి 20 మాత్రమే వస్తున్నాయి. డ్రైవింగ్ లైసెన్స్ కోసం ప్రతి రోజు 20 నుంచి 25 దరఖాస్తులు వస్తున్నాయి. దీంతో రవాణాశాఖకు ఆదాయం భారీగా తగ్గింది. గత సంవత్సరం రవాణాశాఖకు వివిధ రూపాల్లో రూ. 33.05 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు రూ 16.58 కోట్లు వచ్చింది.వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని స్లాట్ బుకింగ్ తర్వాత ఆన్‌లైన్‌లోనే ఫీజు చెల్లించాలి. వారు ఎంచుకున్న తేదీలో రవాణాశాఖ కార్యాలయంలో సంప్రదించాలి. కార్యాలయంలో రిజిస్టర్ అయిన తర్వాత బయోమెట్రిక్, ఫొటో దిగిన అనంతరం వివరాలు నమోదు అవుతాయి. ఈ ప్రక్రియ పూర్తయిన 24 గంటల లోపు కార్డు జనరేట్ అవుతుంది. దీంతో కార్డును ప్రింట్ చేస్తారు. తర్వాత సిబ్బంది పోస్టు ద్వారా పంపిస్తారు. 15 రోజులలోపు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఆర్‌సీ కార్డు సంబంధిత చిరునామాకు చేరుతుంది. కొందరు వ్యక్తులు ఆధార్ కార్డులోని చిరునామాతో వివరాలు నమోదు చేసి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. అడ్రస్ తప్పుగా ఉన్నా, పోస్టల్ సిబ్బంది వెళ్లినపుడు ఇంట్లో ఎవరూ లేకపోయిన దానిని తిరిగి కార్యాలయంలో అందజేస్తారు. గతంలో చిప్ కార్డులతో డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ కార్డులు జారీ అయ్యేవి. వాటి కొరత వల్ల కార్డుల జారీ ఆలస్యమయ్యేది. ప్రస్తుతం నార్మల్ కార్డులు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేస్తుంది. వీటివల్ల కార్డుల జారీ కొద్ది రోజుల్లోనే పూర్తవుతుంది. ఏదైనా పొరపాటు వల్ల కార్డులు అందని వారు రవాణాశాఖ కార్యాలయంలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటలలోపు సంప్రదిస్తే కార్డు స్టేటస్‌ను పరిశీలించి వారికి కార్డులు వెతికి ఇస్తారు. సాఫ్ట్‌వేర్ సమస్య వల్ల కూడా కొన్ని కార్డులు జంప్ అవుతాయి. వాటిని కూడా చెక్ చేసి అందజేస్తామ ని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. మోటార్ సైకిల్ అమ్మిన వారు తప్పని సరిగా కొన్న వ్యక్తిపై ట్రాన్స్‌ఫర్ చేయించాలి. ఒకవేళ బదిలీ చేయించకపోతే కొన్న వ్యక్తి ఎక్కడైనా ప్రమాదం జరిపితే ఆ వాహన యజమానిపై కేసు నమోదు చేస్తారు.ఎలక్ట్రిక్ వాహనాలకు 0.25 కిలోవాట్ కంటే ఎక్కువ మోటార్ ఉండి, 25 కిలోమీటర్ల స్పీడ్‌తో వెళ్లి, వాహనం బరువు 60 కిలోల కంటే ఎక్కువ ఉంటే అటువంటి వాహనాలకు రిజిస్ట్రేషన్ అవసరం. ప్రస్తుతం జిల్లాలో రిజిస్ట్రేషన్ అవసరం లేని ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. వీటిని ఒకసారి ఛార్జింగ్ చేస్తే 60 కిలో మీటర్ల వరకు వెళ్తాయి.

రాకపోతే కార్యాలయంలో సంప్రదించాలిఎలక్ట్రిక్ వాహనాల రాకతో మోటార్ సైకిల్ రిజిస్ట్రేషన్లు తగ్గాయి. గతంలో రోజుకు 40 నుంచి 45 వాహనాలు రిజిస్ట్రేషన్‌కు రాగా ప్రస్తుతం 15 నుంచి 20 వస్తున్నాయి. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలి. డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు రోజుకు 25 లోపు వస్తున్నాయి. బయోమెట్రిక్ అయిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు ఆర్‌సీ కార్డులను సంబంధిత చిరునామాకు పోస్టు ద్వారా 15 రోజుల్లో ఇంటికి పంపిస్తాం.

# కబ్జాలో సింగరేణి స్థలాలు



భూపాలపల్లి : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూములతో పాటు సింగరేణి సంస్థకు చెందిన ఖాళీ స్థలాలు కబ్జాకు గురవుతున్నా యి. ఇతరులకు దర్జాగా రిజిస్ట్రేషన్లు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నా రు. ఈ తతంగం కొద్ది నెలల నుంచే కొనసాగుతుండగా తాజాగా పట్టణంలోని యాదవ కాలనీలో ఒకే ప్లాట్ నంబరుపై ఇద్దరికి రెవెన్యూ అధికారులు పట్టా సర్టిఫికెట్‌లు జారీ చేశారు. అక్రమంగా పట్టా పొందిన వ్యక్తి మరో అడుగు ముందుకేసి, పురపాలక సంఘం కార్యాలయంలో తనపేరుతో ఇంటిని కూడా మార్చుకున్నారు. మున్సిపా లిటీ అధికారులు గతంలో ఎవరి పేరుతో ఆ ఇల్లు మున్సిపాలిటీ రికార్డులో ఉందో వారికి తెలియకుండా, ఎలాంటి విచారణ చేపట్టకు ండానే వేరే వ్యక్తి పేరుతో మార్చడంపై బాధితుడు గోనె అనిల్ స్థానిక మున్సిపాలిటీ కమిషనర్‌కు, ఆర్‌ఐలకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఇంటి నంబర్ల కేటాయింపులోనూ మున్సిపల్ సిబ్బంది అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. పట్టణంలోని కొన్ని కార్మిక కాలనీల్లో అనుమతి లేకుండా ఇంటి నిర్మాణాలు కొనసాగు తున్నాయి.

ఖాళీ స్థలాలకు రక్షణ లేదు

భూపాలపల్లి సింగరేణి డివిజన్‌లో కార్మికులకు 15 ఏళ్ల క్రితం సుమారుగా 785 కుటుంబాలకు వంద గజాల చొప్పున ఇంటి స్థలాలు కేటాయించారు. సుభాష్‌కాలనీ, కృష్ణాకాలనీ, యాదవకాలనీల్లో చాలా మంది ఈ స్థలాల్లో పక్కా గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. సుమారు 50 మంది వరకు వారికి కేటాయించిన ప్లాట్లను తిరిగి సింగరేణి సంస్థకు అప్పగించారు.అప్పటినుంచి ఆ 50 ప్లాట్లు ఖాళీగానే ఉన్నాయి. కొద్ది రోజుల నుంచి ఈ ఖాళీ ప్లాట్లు కబ్జాకు గురవుతున్నా యి. దాదాపుగా 30 ప్లాట్ల వరకు కొందరు దళారులు ఇతరులకు బినామీ ఇంటి నంబర్లతో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. గతేడాది వరకు కృష్ణా కాలనీలోని ఖాళీ స్థలాల రక్షణ బాధ్యత సింగరేణి యాజమాన్యం చూసింది. ఈ మేరకు కాలనీలో సుమారు 70 ఎకరాల భూమిని సింగరేణి సంస్థ రెవెన్యూ శాఖకు బదిలీ చేసింది. దీంతో రెవెన్యూ అధికారులు జీవో నంబరు 76 ప్రకారం ఈ ప్లాట్లలో సర్వే నిర్వహించి, ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారికి ఆరు నెలల క్రితం పట్టాలు జారీ చేశారు. ఖాళీగా ఉన్న స్థలాల్లో మాత్రం ఎవరికీ పట్టాలు ఇవ్వలేదు. ఇదే అదనుగా భావించిన కొందరు దళారులు ఖాళీ స్థలాలపై కన్నేశారు. రూ.3 లక్షల చొప్పున ఖాళీ స్థలాలను ఇతరులకు కొందరు దళారులు విక్రయించినట్లు తెలిసింది. దాదాపుగా 30 ప్లాట్ల వరకు ఇతరులకు అమ్ముకున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొందరు ఖాళీ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

పట్టా పొందిన వారికే 'మ్యుటేషన్' చేస్తున్నాం

భాస్కర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ప్రభుత్వం నుంచి పట్టా పొందిన వారికే మ్యుటేషన్ చేస్తున్నాం. ఒకే ప్లాట్ నంబరుపై పట్టా పొందిన వ్యక్తి పేరుతోనే మ్యుటేషన్ చేశాం. అయితే అంతకు మందే సాదా కాగితాలతో ఇళ్లు కొన్నట్లు చూపించిన ఆధారాల మేరకు 2018లోనే ఇంటి పేరు మార్చారు. రెవెన్యూ అధికారులు ఒకే ప్లాటుకు ఇద్దరికి ఎలా పట్టాలు ఇచ్చారనేది తెలియదు. గతంలో ఇళ్లు లేకున్నా కొందరు ఇంటి నంబర్లు పొందినట్లు తెలిసింది. ఈ విషయంపై తహసీల్దారు శ్రీనివాస్‌ను సంప్రదించగా ఇంతవరకు ఈ విషయం మా దృష్టికి రాలేదని, విచారించి చర్యలు తీసుకుంటా మన్నారు.

# చిన్న రైల్వే స్టేషన్లపై శీతకన్ను!




వరంగల్ : ప్యాసింజరు రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చడం.. గత నాలుగు నెలలుగా కొన్నింటిని రద్దు చేయడం వల్ల చిన్న రైల్వే స్టేషన్లు వెలవెలబోతున్నాయి. నిర్వహణ భారం తగ్గించుకోవడానికి ఆదాయం లేని చిన్న రైల్వే స్టేషన్లను క్రమంగా ప్రజలకు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే భావన వ్యక్తమవుతోంది.

టౌన్ రైల్వే స్టేషను కనుమరుగు బల్లార్షా- వరంగల్ మార్గంలో నడిచే రైళ్లను ఆపడానికి 2001లో కాజీపేట వంతెన కింద నిర్మించిన కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ ఇప్పుడు కనుమరుగవుతోంది. గతంలో బల్లార్షా- భద్రాచలం రోడ్ల మధ్య నడిచే సింగరేణి ప్యాసింజరు రైలు, విజయవాడ- పెద్దపల్లి మధ్య నడిచే పెద్దపల్లి వీకెండ్ రైళ్లు మాత్రమే ఆగేవి. ఇప్పుడు పెద్దపల్లి రైలును రద్దు చేయడంతో సింగరేణి మాత్రమే ఆగుతుంది. అది కూడా ఈనెల 10వ తేదీనే తిరిగి ప్రారంభమైంది. ఇదీ పరిస్థితి: నిర్వహణ లేక టౌన్ స్టేషను ప్లాటుఫారం మీద గడ్డిమొలిచింది. ప్రవేశ ద్వారంలో చెత్త బురద చేరింది. రూ.7 కోట్లు వెచ్చించి నిర్మించిన స్టేషను ఇప్పుడు కేవలం రిజర్వేషను కౌంటర్ కోసం మాత్రమే పనిచేస్తుంది. రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

సిగ్నలింగ్‌కే పరిమితం

ప్యాసింజరు కూత లేక కొన్ని చిన్న రైల్వే స్టేషన్లు కేవలం రైళ్లకు సిగ్నళు ఇవ్వడానికే పరిమితమయ్యాయి. ఇక్కడి ప్రయాణికులు దూరంలో ఉన్న మరో పెద్ద రైల్వే స్టేషన్లకు వెళ్లాల్సి వస్తుంది. ఉదయం కూరగాయలు, పాలు ఇతర ప్రాంతాలకు వెళ్లి అమ్ముకునే రైతులకు ఇది ఇబ్బందిగా మారింది. చిన్న రైల్వే స్టేషన్లలో ఆదాయం లేదని రైల్వే అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా మూడోలైను పనుల సాకును చూపిస్తూ క్రమంగా వీటిని మూసివేత దిశగా నడిపిస్తున్నారు. ఏయే స్టేషన్లు అంటే..విజయవాడ మార్గంలో చింతలపల్లి, ఎలుగూరు, ఇంటికన్నె, గార్ల, తాళ్ల పూసలపల్లి, గుండ్రాతి మడుగుబల్లార్షా మార్గంలో హసన్‌పర్తి రోడ్, ఉప్పల్, పొత్కపలి, కొలనూరు, కొత్తపల్లి, రాఘవపురం ఎక్స్‌ప్రెస్‌ల పేరుతో..ఆదాయం తక్కువగా వస్తుందని ప్యాసింజరు రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చి ఛార్జీలు పెంచి క్రమంగా సాధారణ ప్రయాణికులకు దూరం చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కరోనా కాలం తర్వాత ప్యాసింజర్ల రైళ్ల పై అనేక ప్రయోగాలు జరుగుతున్నాయి. ముందుగా ఆదరణ లేదని కొన్ని రైళ్లను పూర్తిగా రద్దు చేశారు.. మరికొన్నింటిని ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చి ఛార్జీలను పెంచి, చిన్న రైల్వే స్టేషన్లలో స్టాపులను ఎత్తివేశారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే అజ్నీ(బల్లార్షా ఎక్స్‌ప్రెస్), రామగిరి, సింగరేణి, సికింద్రాబాదు పుష్‌పుల్, పెద్దపల్లి (వారంతపు రైలు), విజయవాడ ప్యాసింజరు, డోర్నకల్ ప్యాసింజరు రైళ్లను రద్దు చేశారు. ఒక వేళ నడిచినా చిన్న రైల్వే స్టేషన్లలో ఇవి గత కరోనా తర్వాత నుంచి ఆగడం లేదు.

అభివృద్ధికి అడ్డుకట్ట- సుమలత ప్రయాణికురాలు

మేము తరచూ బల్లార్షా మార్గంలోని రాఘవపురం, విజయవాడ మార్గంలో చీమలపాడుకు వెళ్తుంటాం. కరోనా తర్వాత ప్యాసింజరు రైళ్లను ఈ స్టేషన్లలో ఆపడం లేదు. రోడ్డు మార్గం కూడా సరిగా లేదు. ఇప్పుడు అవసరమైతే తప్ప వెళ్లడం లేదు. చిన్న రైల్వే స్టేషన్లలో రైళ్లను ఆపకపోతే ఆ ప్రాంతంలోని ప్రజలు రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడతారు. తద్వారా ఆ ప్రాంతం కూడా అభివృద్ధికి నోచుకోదు.

ఎక్స్‌ప్రెస్‌లను ఆపండి- కృష్ణమూర్తి ప్రయాణికుడు

బల్లార్షా మార్గంలో ఓదెల వెళ్లాలంటే ఇంతకు ముందు ప్యాసింజరు రైళ్ల ద్వారా సులువుగా ఉండేది. ఇప్పుడు వాటిని ఎక్స్‌ప్రెస్‌లు మార్చడం, పైగా మూడోలైను పనులతో రద్దు కావడం వల్ల రోడ్డు మార్గాన్ని ఎంచుకోవాల్సి వస్తోంది. రెండు మూడు బస్సులు, ఆటోలు మార్చి వెళ్లాల్సి రావడంతో ఖర్చు ఎక్కువ అవుతుంది. చిన్న రైల్వే స్టేషన్ల ఆదాయం లేదని చిన్నచూపు చూడటం సరికాదు. ఒక్క ప్రయాణికుడు ఉన్నా రైళ్లను నడపాలి లేదా ఇప్పుడు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నిలపాలి.

# ఈసారి ముందే చేతికందనున్న వరి

జగిత్యాల : జిల్లాలో ఈ వానాకాలంలో పక్షం రోజుల ముందుగానే రైతులు వరినాట్లు చేపట్టగా నిరుటికన్నా ముందస్తుగానే మరో వారంపది రోజుల్లో నూర్పిడులు ఆరంభం కానున్నాయి. ఈ సీజన్‌లో గరిష్ఠ స్థాయిలో 3.05 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టగా దాదాపుగా 4.5 లక్షల టన్నులకు పైబడి ధాన్యం దిగుబడి అంచనాగా ఉంది. త్వరలోనే వరికోతలు ఆరంభం కానున్నందున జిల్లాలో కనీసం 400 ప్యాక్స్, ఐకేపీ, మెప్మా కేంద్రాలను ఏర్పాటుచేసి దసరా వరకు కొనుగోలుకు సిద్ధం కావాల్సి ఉంది.ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుల్లో నిల్వచేసి మరాడించిన తరువాత బియ్యాన్ని తీసుకుంటుంది. కానీ గత రెండు సీజన్ల ధాన్యానికి చెందిన పూర్తిస్థాయిలో బియ్యం మిల్లుల నుంచి ప్రభుత్వానికి చేరలేదు. ఈ పరిస్థితులు వానాకాలం ధాన్యం కొనుగోలుపై పడకుండా చూడాలి. ప్రభుత్వం అనుమతించిన మేరకు తేమ, నాణ్యతా ప్రమాణాలున్నా, ఏఈవోలు నాణ్యతను ధ్రువీకరించినా గత సీజన్‌లలో తరుగును తీసుకోవటంతో తాము తీవ్రంగా నష్టపోయామని, ఈ సీజన్‌లో తరుగు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.టీసెర్ప్, మార్కెటింగ్ శాఖ ద్వారా గతంలో అన్ని సేకరణ కేంద్రాలకు టార్పాలిన్లను ఇవ్వగా వీటిల్లో చాలావరకు పత్తాలేకుండా పోయాయి. వ్యవసాయ, ఉద్యానశాఖల ద్వారానూ రైతులకు టార్పాలిన్లు రాయితీపై ఇవ్వనందున వర్షంవస్తే ధాన్యం తడిసి ముద్దవ్వాల్సిందే. ఈ నేపథ్యంలో రైతులకు రాయితీపై టార్పాలిన్లను ఇవ్వాలి, ప్రతి కేంద్రానికి కనీసం 50-100 టార్పాలిన్ షీట్లను అందుబాటులో ఉంచాలి. మేలు రకాలకు క్వింటాలుకు రూ.2,203, సాధారణ రకాలకు రూ.2,183 మద్దతు ధర ఉండగా డబ్బుల చెల్లింపులో జాప్యం జరగకుండా చూడాలి. నిర్వాహక సంఘాలకు బకాయిగల కమీషన్‌ను విడుదల చేయాలి. సంఘాలకు నిర్వహణ ఖర్చును పెంచాల్సి ఉంది. ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు కాకుండా తరాజులు వాడటం, తేమ యంత్రాలు పాతబడటం, సామగ్రి నిల్వకు కనీసం గదులు కూడా లేనందున తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు వంటి సదుపాయాలు కల్పించాలి.నిబంధనల ప్రకారమే రైతుల నుంచి హమాలీఛార్జీలను వసూలు చేయాలి.

# ఆధార్ నమోదు కష్టాలు తీరేదెన్నడు

సుల్తానాబాద్: మేజర్ పంచాయతీ స్థాయి నుంచి పురపాలక సంఘంగా ఆవిర్భవించినందున వివిధ సేవలు అందుబాటులోకి వస్తాయని ఆశించిన సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది. కనీస వసతులు కరవై ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణంలో ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో స్థానికులు పెద్దపల్లి, కరీంనగర్ పట్టణాలకు వెళ్లి ప్రయాస పడుతున్నారు.

సుల్తానాబాద్ తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని గదిలో ఆధార్ నమోదు కేంద్రం నిర్వహించారు. రెండేళ్ల కిందట వర్షాకాలంలో పిడుగుపాటుకు కేంద్రంలోని కంప్యూటర్లు, సామగ్రి కాలిపోగా ఇప్పటికీ పునరుద్ధరణకు నోచుకోలేదు. అధికారుల అలసత్వమో, కేంద్రం నిర్వాహకుడి నిర్లక్ష్యమో గానీ రెండేళ్లుగా సుల్తానాబాద్‌తో పాటు ఎలిగేడు, ఓదెల, మానకొండూర్ మండలాల ప్రజలు పెద్దపల్లి, కరీంన గర్‌లకు వెళ్తూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. మండలంలోని 27 పంచాయతీలతో పాటు, పరిసర మండలాలకు కూడలిగా ఉన్న సుల్తానాబాద్‌లో రెండు ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అనుసంధానం తప్పనిసరి కావడంతో..

వివిధ పథకాలు, సేవలకు ఆధార్ అనుసంధానాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు, నవీకరణ చేయాల్సి ఉంటుంది. సుల్తానాబాద్ పట్టణంలో నమోదు కేంద్రం అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు



పడుతున్నారు. పిల్లల వివరాల నమోదు, పిల్లలు, వృద్ధుల వేలిముద్రలు పడకపోవడం, నవీకరణ, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భారత్, రైతుబంధు, రైతుబీమా, పింఛన్లు, రేషన్‌కార్డులు, ఉపకార వేతనాలు తదితర పథకాల కోసం ఆధార్‌ను ఫోన్ నంబరుకు అనుసంధానిస్తోంది. దీని కోసం స్థానికులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

మూడు సార్లు పెద్దపల్లికి వెళ్లినా కాలేదు

ఈకేవైసీ కోసం రేషన్ దుకాణానికి వెళ్తే వేలిముద్రలు పడటం లేదు. నవీకరణ కోసం పెద్దపల్లిలోని ఓ ఆధార్ నమోదు కేంద్రానికి మూడు సార్లు వెళ్లాను. అయితే రోజుకు 30 మందికే అవకాశం ఉందంటూ తిరిగి రమ్మని పంపించారు. వెళ్లినప్పుడల్లా రూ.100 ఖర్చవడమే కాక ఆరోగ్యం సహకరించక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానికంగా నమోదు కేంద్రం ఉంటే ఈ అవస్థలు ఉండేవి కావు.

కనకమ్మ, సుల్తానాబాద్


కలెక్టర్‌కు నివేదించాం

పట్టణంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు కోసం నెల రోజుల కిందటే కలెక్టర్‌కు నివేదించాం. అనుమతులు వచ్చిన వెంటనే తొందరలోనే కేంద్రం ఏర్పాటు చేస్తాం. రేషన్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీలకు చివరి తేదీ అంటూ లేదు. ఇది నిరంతర ప్రక్రియ. ప్రజలు ఆందోళన చెందవద్దు.బి.మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్

## ఆదాయ మార్గాలపై పట్టింపు కరవు

పెద్దపల్లి: బల్దియాల్లో పాలన గాడి తప్పింది. పాలకులు ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకవర్గాల ఉదాసీన వైఖరితో పాలన పట్టు తప్పుతోంది. ఇంటి, ఆస్తి, చెత్త తదితర అన్ని రకాల పన్నులను ముక్కుపిండి వసూలు చేస్తున్నప్పటికీ బల్దియాలకు వచ్చే ఆదాయ మార్గాలపై మాత్రం శ్రద్ధ వహించడం లేదు. జిల్లాలోని రామగుండం నగరపాలక సంస్థ, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పురపాలక సంఘాల పరిధిలో ప్రకటనల హోర్డింగ్‌ల నిర్వాహకుల నుంచి రుసుం వసూలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆయా పార్టీల అధికారిక కార్యక్రమాలు, రహదారులపై రాకపోకలకు అంతరాయం కలిగించేలా బ్యానర్లు, ఫ్లెక్సీలు యథేచ్ఛగా ఏర్పాటు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. పర్యవేక్షణ లోపం రామగుండం నగరం, మూడు పురపాలికల పరిధిలోని ప్రధాన రహదారుల మధ్యలో గతంలో హోర్డింగులు ఏర్పాటు చేశారు. ఒక్కో హోర్డింగ్‌కు పరిమాణాన్ని బట్టి ఏడాదికి రూ.40 వేల నుంచి రూ.65,000 వరకు బల్దియాకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన నగపాలిక, పురపాలికలు కలిపి ప్రతి సంవత్సరం రూ.10 లక్షల వరకు ఆదాయం రావాల్సి ఉంది. అనధికార హోర్డింగ్‌లను పట్టించుకోకపో వడంతో రాకుండా పోతోంది. యాడ్ ఏజెన్సీలు బల్దియాలకు డబ్బులు కట్టకుండా రూ.లక్షలు సంపాదిస్తు న్నాయి. ఈ విషయమై ప్రతిపక్ష పార్టీలు అధికారులను నిలదీసినా ఎలాంటి స్పందన లేకపోయింది.

రామగుండం నగరపాలక సంస్థలో రూ.15 లక్షలు, పెద్దపల్లి పురపాలక సంఘంలో రూ.90 వేలు, సుల్తానాబాద్‌లో రూ.40 వేలు, మంథనిలో రూ.3 వేల ఆదాయం మాత్రమే వచ్చినట్లు అధికారులు చెబుతుండటం



పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోంది.

రాజకీయ పార్టీల బహిరంగ సభలు, అధికారిక కార్యక్రమాలు, పుట్టిన రోజు వేడుకలు, పండుగల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపే ప్రకటనలు.. ఇలా ఒక్కటేమిటి పదుల సంఖ్యలో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు వెలుస్తూనే ఉ న్నాయి. ఆదాయ మార్గాలున్నా బల్దియాల పాలకవర్గం నిర్లక్ష్యం వహిస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పురపాలక చట్టం ప్రకారం వాహనదారుల రాకపోకలు ఎక్కువగా, ట్రాఫిక్ రద్దీ అత్యంత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రచార ప్రకటనలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దనే నిబంధనలున్నాయి. ఇవేవీ పాటించకుండానే నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ప్రాంతాల్లో, విద్యుత్తు స్తంభాలకు, రహదారులపై కర్రలు పాతి అనధికారికంగా ఏర్పాటు చేస్తున్నారు. లెక్క ప్రకారం ఇలాంటి వాటిని మున్సిపల్ సిబ్బంది గుర్తించి అనుమతులున్న వాటిని మినహాయించి మిగిలిన వాటికి జరిమానాలు విధించి తొలగించాల్సి ఉంటుంది. పట్టణ ప్రణాళిక విభాగం వారు నిర్లక్ష్యం అనే మత్తు వీడితేనే బల్దియాలకు ఆదాయ మార్గం వచ్చే అవకాశముంది.

# ఆన్‌లైన్ యాప్‌తో ఘరానా మోసం..!

ఖమ్మం: ఆన్‌లైన్ యాప్ పేరిట లక్షలాది రూపాయలు వసూళ్లు చేసి అనేకమందిని బురిడీ కొట్టించారు. ఈ ఘటనలో దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాలకు చెందిన వందలాది మంది మోసపోయారు. బాధితుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు మూడు నెలల కిందట ఆన్‌లైన్ యాప్ పేరిట యువకులపై వల విసిరారు. తమ యాప్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే రోజువారీ చెల్లింపుల రూపంలో పెట్టుబడికి రెండింతలు ఇస్తామని ఆశచూపారు. నమ్మిన కొందరు పెట్టుబడి పెట్టారు. తొలుత రూ.లక్ష పెట్టుబడి పెడితే రోజుకు వెయ్యి చెల్లిస్తానంటూ కొందరి వద్ద డబ్బు వసూలు చేశాడు. యాప్‌లో భైరవ్‌సింగ్ అనే వ్యక్తి తమ కంపెనీ తమిళనాడు కేంద్రంగా వ్యాపారం చేస్తోందని, పెట్టుబడిదారులతో ఆన్‌లైన్‌ద్వారా మాట్లాడేవాడు. నెలలోనే వందల సంఖ్యలో పెట్టుబడి పెట్టారు. యాప్‌లో



ఏరోజుకారోజు కొత్త ఆఫర్‌లతో వల విసరడంతో మొత్తంగా యాప్‌లో ఒక్క దమ్మపేటలోనే 250 మందికి పైగా చేరారు. వారంలోనే ఆఫర్ పెంచి రూ.లక్షకు రోజుకు పదివేలు ఇస్తానంటూ నమ్మించాడు. పలువురు యాప్‌ద్వారా తిరిగి తీసుకున్న సొమ్ములను సైతం మళ్లీ అక్కడే పెట్టుబడి పెట్టారు. మంగళవారం నుంచి యాప్ మూగబో యింది. పెట్టుబడి పెట్టిన వారంతా నెత్తినోరు బాదుకుంటున్నారు. ఈ యాప్‌లో దమ్మపేట, అశ్వారావుపేట సహా జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వారు పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. బాధితులంతా తమకు జరిగిన మోసాన్ని బయటకు చెప్పుకోలేక, చెబితే పరువు పోతుందనే భయంతో మిన్నకుండిపోతున్నారు. పోలీసులు విచారణ చేయాలని బాధితులు కోరుకుంటున్నారు. ఈ మోసాన్ని 'న్యూస్‌టుడే' దమ్మపేట ఎస్సై రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆన్‌లైన్ యాప్ మోసం ఘటన తమ దృష్టికి రాలేదన్నారు. బాధితులు నేరుగా ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామని తెలిపారు.

# చిరు వ్యాపారుల కష్టాలు తీరేనా?

భూపాలపల్లి : జిల్లా కేంద్రంలో తొమ్మిదేళ్ల క్రితం చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా చిరువ్యాపారులు ఉపాధి కోల్పోయారు. అప్పటి మాజీ స్పీకర్ మధుసూదనాచారి కృషి ఫలితంగా చిరువ్యాపారులకు ప్రభుత్వ స్థలాలను కేటాయించి పక్కా దుకాణ సముదాయాల నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే కోర్టు కేసు కారణంగా గుత్తేదారు అర్ధాంతరంగా పునాదుల వరకే నిర్మించి వదిలిపెట్టారు. దీంతో 58 మంది చిరువ్యాపారుల కుటుంబాల బతుకులు రోడ్డున పడ్డాయి. దాదాపు 25 ఏళ్ల క్రితం అటవీ శాఖ కార్యాలయాల సమీపంలో రోడ్డు అంచున రేకుల షెడ్లు, డబ్బాలు ఏర్పాటుచేసుకొని ఉపాధి పొందిన వీరు ఇప్పుడు అష్టకష్టాలు పడుతున్నారు.

స్వచ్ఛందంగా తొలగించుకున్నా..

రోడ్డు విస్తరణ పనులు అడ్డుకునేందుకు చిరు వ్యాపారులు అప్పట్లోనే సిద్ధమైనప్పటికీ మాజీ స్పీకర్ ఇచ్చిన హామీ మేరకు స్వచ్ఛందంగా వారి రేకుల షెడ్లు, డబ్బాలు తొలగించుకున్నారు. అదే ప్రాంతంలో అటవీ శాఖకు సంబంధించి స్థలం 750 చదరపు గజాలను దుకాణ సముదాయాలకు కేటాయించారు. ఈ క్రమంలో కొందరు ఆ భూములు తమవేనంటూ కోర్టులో కేసు వేయగా కోర్టు ఆదేశాల మేరకు ఏడాది క్రితం సర్వే చేపట్టగా అటవీశాఖకు చెందినట్లు తేలింది. తొమ్మిదేళ్లుగా చిరు వ్యాపారులు తమకు కేటాయించిన స్థలాల్లో పక్కా షెడ్లను నిర్మించుకునేందుకు అవకాశం కల్పించాలని కనిపించిన అధికారులకు, పాలకులకు మొరపెట్టుకుంటూనే ఉన్నారు. ప్రస్తుత భూపాలపల్లి ఎమ్మెల్యే రమణారెడ్డి క్యాంపు ఆఫీసు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. షెడ్ల నిర్మాణాల కోసం వ్యాపారులు ఒక్కొక్కరు సుమారు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేసుకున్నా నిర్మాణ పనులు నిలిచిపోవటంతో పలువురు చిరు వ్యాపారులు ఉపాధి లేక కూలీ పనులకు వెళ్తున్నారు.

పూలు అమ్మితేనే జీవనం

పర్తెం చంద్రకళ, పూల వ్యాపారి

గతంలో రూ.రెండు లక్షలు ఖర్చు చేసి నిర్మించుకున్న రేకుల షెడ్డు కూల్చివేయడంతో రోడ్డున పడ్డాం. పూలు అమ్ముకుంటేనే తమ కుటుంబానికి నాలుగు మెతుకులు అందుతున్నాయి. పక్కా దుకాణాల నిర్మాణానికి అప్పు చేసి రూ.లక్ష చెల్లించినప్పటికీ సదరు గుత్తేదారు పునాదుల వరకే నిర్మించారు. ఎండాకాలం మండుటెండల్లో, వానాకాలంలో వర్షంలో తడిసిపోతూ వ్యాపారం చేయాల్సివస్తోంది. ఇప్పటికైనా మా పేద కుటుంబాల గురించి పట్టించుకోవాలి.

ఓపిక నశించింది..కె.లక్ష్మి, చిరు వ్యాపారి

తొమ్మిదేళ్లుగా ఎదురుచూస్తున్నాం..ఇక మాకు ఓపిక నశించింది. మాలాంటి పేదలను ప్రభుత్వం పట్టించుకుంటే రాబోయే ఎన్నికల్లో ఓట్లు వేస్తాం. తొమ్మిదేళ్లుగా రోడ్లపైన దుమ్ము, ధూళితో అనారోగ్యానికి గురవుతున్నాం. స్థానిక ప్రజా ప్రతినిధులు సహకరిస్తే, 56 మంది చిరు వ్యాపారుల కుటుంబాలకు న్యాయం జరుగుతుంది.

ఉపాధి లేకుండా పోయిందిర్యాకల విష్ణు, దర్జీ

షెడ్లు కూల్చివేసిన తర్వాత ఎలాంటి ఉపాధి లేకుండా పోయింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు గతంలో ఇచ్చిన హామీ ప్రకారం తమకు కేటాయించిన స్థలాల్లో పక్కా దుకాణాల సముదాయాల నిర్మాణానికి కృషి చేస్తే జీవితాంతం రుణపడి ఉంటాం. స్థానిక ఎమ్మెల్యే మా బతుకుల గురించి పట్టించుకోవాలి.

ఆర్థికంగా నష్ట పోతున్నాంఈర్నాల జానీ, చిరు వ్యాపారి

గతంలో వ్యాపార అభివృద్ధి కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద తెచ్చుకున్న అప్పులు పెరిగిపోతున్నాయి. మరో వైపు కుటుంబ పోషణకు కష్టమైంది. తమ సమస్యను ఎమ్మెల్యేగారే పరిష్కరించాలి. లేకుంటే మా బతుకులు మరింత చితికిపోతాయి. ఇప్పటికైనా షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభించుకునేందుకు తమకు అనుమతివ్వాలి.

# డబ్బు చేరకుండా.. మద్యం పారకుండా..!



ఖమ్మం : ధన ప్రవాహం అధికంగా ఉండే నియోజకవర్గాలపై ఎన్నికల సంఘం (ఎలెక్షన్ కమిషన్) ప్రత్యేక దృష్టి సారించింది. ఈ జాబితాలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పలు నియోజకవర్గాలు ఉండటం గమనార్హం. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపకాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం అవసరమైన చర్యలు చేపట్టనుంది.

అన్నింటా విలక్షణమే..

ఉభయ జిల్లాల్లో జనరల్-3, ఎస్సీ రిజర్వ్‌డ్-2, ఎస్టీ రిజర్వ్‌డ్- 5 శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. తెలంగాణ ఆవిర్భావం తరువాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మిగతా జిల్లాల కన్నా ఇక్కడి ప్రజలు విలక్షణమైన తీర్పునిస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. ఎన్నికల సమయంలో ఆర్థికంగా అత్యంత ప్రభావిత నియోజకవర్గాల జాబితాలో ఉభయ జిల్లాల్లోని పలు స్థానాలు ఉండటమూ ఇదే కోవకు చెందుతుంది. రాజకీయ, మత, తీవ్రవాద ప్రభావిత నియోజకవర్గాల జాబితాల్లోనూ కొన్ని స్థానాలు ఉండటంతో ఎన్నికల నిర్వహణను ఈసీ సవాల్‌గా తీసుకుంది. డబ్బు, మద్యం ప్రవాహానికి అడ్డుకట్ట వేయడంతోపాటు రాజకీయ ఘర్షణలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైన ప్రాంతాలపై ఈసారి ప్రత్యేక దృష్టి సారించే అవకాశముంది.

అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద..

ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు సరిహద్దుగా ఉన్నాయి. ప్రధానంగా ఏపీ నుంచి ఊహించని రీతిలో ఇక్కడికి ఎన్నికల డబ్బు, మద్యం తరలివస్తుందని ఈసీ గుర్తించింది. అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు, జిల్లాల్లో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘాను పటిష్ఠపరచాలని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేసింది. కలెక్టర్లు, పోలీసు బాసులతో హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో దీని గురించి ప్రస్తావించినట్లు తెలిసింది. ముఖ్యంగా పోలీసుశాఖ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ధన ప్రవాహం అధికంగా ఉండే నియోజకవర్గాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం కుదుర్చుకొని డబ్బు, మద్యం సరఫరాకు అడ్డుకట్ట వేయనున్నారు. ఇందుకోసం పోలీసు, ఎక్సైజ్, రవాణా శాఖలు సంయుక్త కార్యాచరణ రూపొందిస్తున్నాయి.

నిఘా వర్గాల ద్వారా సమాచార సేకరణ..2009 నుంచి జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ఆర్థిక సమస్యాత్మక నియోజవ ర్గాల జాబితాలో రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి అత్యధిక స్థానాలున్నాయి. మూడు జనరల్ స్థానాలతోపాటు ఎస్సీ, ఎస్టీ నియోజక వర్గాల్లోనూ డబ్బు, మద్యం ప్రవాహం అధికంగా ఉంటుందన్నది ఎన్నికల సంఘం అంచనా. కొన్నేళ్లుగా ఎన్నికలు సాగుతున్న తీరు, డబ్బు, మద్యం ప్రవాహంతోపాటు రాజకీయంగా తలెత్తే పరిస్థితులపై నిఘా వర్గాల ద్వారా పూర్తి సమాచారాన్ని ఈసీ ఇప్పటికే సేకరించింది. 2018లో ఒక్క నియోజకవర్గంలోనే ఎన్నికల ఖర్చు దాదాపు రూ.150 కోట్లు దాటడం వంటి పరిణామాలను తీవ్రంగా పరిగణిస్తోంది. ఈసారి మరిన్ని నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీల మధ్య పోరు ఉత్కంఠభరితంగా సాగుతుండటంతో యథేచ్ఛగా డబ్బు, మద్యం పంపిణీకి అవకాశముందని ఈసీ వర్గాలు భావిస్తున్నాయి.

సీజ్ నగదు కోసం నోడల్ అధికారిని సంప్రదించాలి: కలెక్టర్

ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో అధికారుల తనిఖీల్లో సీజ్ చేసిన నగదు కోసం జిల్లా వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి విజయకుమారిని సంప్రదించాలని కలెక్టర్ గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా వ్యయ పర్యవేక్షణ మానిటరింగ్ సెల్‌లో అందుబాటులో ఉండే విజయకుమారికి ఫోన్ (నం.94921 04983) చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తుంటే సరైన ఆధారాలు, పత్రాలు చూపించాలని.. లేకుంటే నగదు స్వాధీనపరచు కుంటామని తెలిపారు.

జీళ్లచెర్వులో కేసీఆర్ ఎన్నికల సభ!

ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న ముఖ్యమంత్రి కేసీఆర్ పాలేరు నియోజకవర్గంలో తలపెట్టిన తొలి సభను కూసుమంచి మండలంలోని జీళ్లచెర్వులో ఏర్పాటు చేయాలని పార్టీ నాయకత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. జీళ్లచెర్వు నుంచి ఖమ్మం వైపు వెళ్లే ప్రధాన రహదారి వారగా అభివృద్ధి చేసిన స్థిరాస్తి వెంచర్లలో సభ నిర్వహించాలని భావిస్తున్నారు. కూసుమంచి, తిరుమలాయపాలెం ఎంపీపీలు బానోతు శ్రీనివాస్, బోడా మంగీలాల్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, కూసుమంచి, ఖమ్మం గ్రామీణం, నేలకొండపల్లి మండలాల భారాస అధ్యక్షులు వేముల వీరయ్య, బెల్లం వేణు, ఉన్నం బ్రహ్మయ్య, మండల కార్యదర్శి ఆసిఫ్‌పాషా, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాసరెడ్డి తదితరులు స్థలాన్ని పరిశీలించారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ ప్రాంతం సభ నిర్వహణకు అనువుగా ఉంటుందని ప్రాథమికంగా నిర్ణయించారు. వాహనాల పార్కింగ్, ఇతర అవసరాలకు రైతులకు సంబంధించిన మరో 40 ఎకరాల భూములు పరిశీలించారు.

జిల్లాలో 22,957 ఓట్లు తొలగింపు

జిల్లాలో ఇటీవల ప్రకటించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం మొత్తం 22,957 మంది పేర్లు తొలగించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణకు ఆగస్టు, సెప్టెంబర్‌లో అధికారులు శ్రీకారం చుట్టారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించి ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణలకు అవకాశం కల్పించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఈనెల 4న ఓటరు తుది జాబితా ప్రకటించారు. ఈ జాబితాలో పేరు నమోదైన వారికి నవంబర్‌లో జరిగే శాసనసభ ఎన్నికల్లో ఓటేసే అవకాశం లభిస్తుంది. జులై 21న ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 11,77,687 మంది ఉండగా వీరిలో 22,957 మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి అధికారులు తొలగించారు. కొత్తగా 41,553 మంది ఓటర్లను చేర్చారు. ఓటరు తుది జాబితా ప్రకారం జిల్లాలో 11,96,293 మంది ఓటర్లు ఉన్నారు. యువ ఓటర్ల నమోదులో ఖమ్మం జిల్లా ప్రథమంఈ ఏడాది జనవరి 1 నుంచి అక్టోబర్ 1 వరకు 18-19 ఏళ్ల వయస్సు కలిగి తొలిసారి ఓటర్లుగా నమోదైనవారు జిల్లాలో 44,204 మంది ఉన్నారు. ఈ విభాగంలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఖమ్మంలో 12,025, పాలేరులో 9,066, మధిరలో 7,710, వైరాలో 6,894, సత్తుపల్లిలో 8,509 మంది తొలిసారి ఓటరుగా నమోదయ్యారు. వీరంతా నవంబర్ 30న మొదటిసారిగా ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. యువ ఓటర్లతో ఖమ్మం జిల్లా కదం తొక్కనుంది. 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండినవారు నామినేషన్ల స్వీకరణ గడువుకు పది రోజుల ముందు (అంటే ఈనెలాఖరు) వరకు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉంది.

# పోడు కేసుల ఎత్తివేత దిశగా..



ఖమ్మం: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో పోడు సాగుదారులకు మరో ఊరట లభించింది. అటవీ భూములను సాగు చేసుకుంటూ దశాబ్దాలుగా హక్కు పత్రాల కోసం నిరీక్షిస్తున్న గిరిజనులకు ఇటీవల పోడు హక్కు పత్రాలు ఇచ్చి వారిని యజమానులుగా మార్చిన ప్రభుత్వం.. తాజాగా పోడు సాగు సమయంలో వారిపై నమోదైన కేసులను ఎత్తివేయాలని నిర్ణయించింది. ఈమేరకు సెప్టెంబర్ 30న ఉత్తర్వును వెలువరించింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 396 పోడు కేసుల్లో గిరిజనులకు త్వరలోనే విముక్తి లభించనుంది.

ఉభయ జిల్లాల్లోనే అధికం..!

పోడు సాగు వివాదాల్లో అధికం ఉభయ జిల్లాలవే. రాష్ట్రంలోనే అత్యధికంగా ఇక్కడే గిరిజనులు పోడు భూములు సాగుచేసుకున్నారు. ఏటా పోడు భూముల సాగు చేసుకునే సమయంలో అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం, సాగుదారులు ఎదురుతిరగడం, కేసులు నమోదవడం పరిపాటిగా మారింది. కొన్ని ప్రాంతాల్లో పోడు భూముల వివాదాలు ఘర్షణలకు దారితీశాయి. అటవీ అధికారులపై దాడులు సైతం చోటుచేసుకున్నాయి. ఈ పరిస్థితులన్నింటినీ చక్కదిద్దేందుకు రెండేళ్ల క్రితం పోడు భూములకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. 2005 కన్నా ముందువరకు పోడు సాగు చేసుకున్న గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఉభయ జిల్లాల్లో దాదాపు 4 లక్షల ఎకరాల పోడు భూముల్లో హక్కుల కోసం సాగుదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఆతర్వాత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి అర్హులను తేల్చింది. ఈ ఏడాది జూన్‌లో పోడు పట్టాలు పంపిణీ చేసింది. భద్రాద్రి జిల్లాలో 50,595 మంది, ఖమ్మం జిల్లాలో 6,598 మంది గిరిజన సాగుదారులకు పోడు హక్కు పత్రాలు అందాయి.

త్వరలోనే విముక్తి..పోడు పట్టాలు అందుకున్న గిరిజనులపై అటవీ భూముల ఆక్రమణల కేసులను ఎత్తివేయాలనే ప్రభుత్వ నిర్ణయం మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పోడు కేసుల వివరాలు అందించాలని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి అన్ని జిజిల్లాల అటవీ అధికారులను ఆదేశించారు. భద్రాద్రి జిల్లాలో 622.09 ఎకరాలకు సంబంధించి 220 కేసులు, ఖమ్మం జిల్లాలో 402.95 ఎకరాలకు సంబంధించి 176 కేసులు ఉన్నట్లు అధికారులు తేల్చారు. గిరిజనులపై నమోదు చేసిన కేసుల తొలగింపు పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఛార్జిషీటు దాఖలైన వాటిని న్యాయస్థానం సూచనల ఆధారంగా ఉపసంహరించుకోనున్నారు. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. అనేక ఏళ్లుగా హక్కు పత్రాల కోసం ఉద్యమించి కేసుల పాలైన గిరిజనులకు ప్రభుత్వ నిర్ణయంతో మరింత ఉపశమనం దక్కనుంది.

# బాలికలకు స్వీయరక్షణ విద్య

కొత్తగూడెం : సర్కారు బడుల్లో బాలికల ఆత్మరక్షణ విద్యకు శ్రీకారం చుట్టారు. చట్టాలెన్ని తెస్తున్నా.. షీటీంలను నియమిస్తున్నా బాలికలు, యువతులు, మహిళలపై దాడులు ఆగటం లేదు. వేధింపులు తగ్గట్లేదు. ప్రేమ పేరిట పోకిరీల ఆగడాలు సరేసరి. ఇలాంటి పరిస్థితుల నుంచి బాలికలు తమను తాము రక్షించేందుకు 2023-24 విద్యాసంవత్సరంలో ఈనెల నుంచి డిసెంబరు వరకు మూడు నెలల పాటు ఉచితంగా కరాటేపై శిక్షణ ఇవ్వనున్నారు. 'మార్షల్ ఆర్ట్స్'లో తర్ఫీదు ఇవ్వాలని విద్యాశాఖ సంచాలకురాలు దేవసేన ఆదేశించారు. శిక్షణ కోసం ట్రైనర్‌కు నెలకు రూ.5వేల చొప్పున వేతనాలు మంజూరు చేశారు. తక్షణమే విద్యాలయాల్లో శిక్షణ ప్రారంభించేలా ఉత్తర్వు ఇచ్చారు. గతేడాది కేవలం ఒక నెల మాత్రమే శిక్షణనిచ్చారు.బాలికలకు భరోసా..విద్యార్థినుల్లో దాగిన ప్రతిభాపాటవాలను వెలికితీసుకురావటానికి స్వీయరక్షణ విద్యకు మక్కువ చూపిస్తుంటారు. ఆకతాయిల ఆగడాల నుంచి రక్షించుకోవటం, శారీరక దృఢత్వం సాధించటం, మానసికోల్లాసం కలిగించేందుకు బాలికా స్వీయరక్షణ విద్య దోహదపడుతుంది. ఖమ్మం జిల్లాలో 112, భద్రాద్రి కొత్తగూడెంలో 112 పాఠశాలల్లో ఎనిమిది, తొమ్మిదోతరగతి బాలికలకు శిక్షణ ఇవ్వనున్నారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలతో పాటు బాలికలున్నా ప్రతి పాఠశాలల్లో ఈ శిక్షణకు అవకాశం కల్పించారు.

# సైన్స్ ల్యాబ్‌ల మరమ్మతులకు రూ.1.89 కోట్లు

భూపాలపల్లి : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, పాఠశాల భవనాల మరమ్మతుల కోసం ప్రధాన మంత్రి ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) నిధులు మంజూరు చేస్తూ, విద్యాశాఖ పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలో 22 పాఠశాలలకు కలిపి మొత్తం రూ.1.89,50,000 నిధులు కేటాయించారు. వీటిలో ఒక్కో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి రూ.16 లక్షల నిధుల చొప్పున ఏడు పాఠశాలల్లో మొత్తం రూ.1.12 కోట్లు మంజూరయ్యాయి. కొన్నేళ్లుగా సైన్సు పరికరాలకు అరకొరగా నిధులు కేటాయించడంతో అవి వృథాగా వెక్కిరిస్తున్నాయి. ప్రయోగాలు చేసేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. రూ.16 లక్షలు మంజూరు కావడంతో సైన్స్ ల్యాబ్‌కు నిధుల కొరత తీరింది. పరికరాలు, రసాయన పదార్థాలు కొనుగోలు చేయనున్నారు. కార్పొరేట్ స్థాయిలో ల్యాబ్‌లు ఆధునికంగా అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం కలిగింది. ఆదర్శ పాఠశాలల్లోని తరగతి గదుల మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఒక్కొక్క బడికి రూ.4.50 లక్షల చొప్పున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 పాఠశాలలకు రూ.67.50 లక్షల వరకు నిధులు విడుదల చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ



పనులు రాష్ట్ర విద్యాశాఖ సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ, పాఠశాల యాజమాన్య కమిటీతో కలిసి చేపట్టనున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం లోపు ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మల్హర్, జనగామ జిల్లాలో బచ్చన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, చౌడారం, మహబూబాబాద్ జిల్లాలో మరిపెడ, ములుగు జిల్లా బండారుపల్లి, వరంగల్ జిల్లా గవిచర్ల గ్రామాల్లోని ఆదర్శ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు నిర్మించనున్నారు. భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్ మల్హర్, మహబూబాబాద్ జిల్లాలో డోర్నకల్, మరిపెడ, నెల్లికుదురు, తొర్రూరు, ములుగు జిల్లాలో బండారుపల్లి, వరంగల్ జిల్లా చెన్నరావుపేట మండలం అమీనాబాద్, గీసుగొండ మండలం వంచనగిరి, బుధరావుపేట, పర్వతగిరి, గవిచర్ల, జనగామ జిల్లాలో చౌడారం, స్టేషన్ ఘన్‌పూర్, బచ్చన్నపేట, హనుమకొండ జిల్లా ఎలుకతుర్తి గ్రామంలోని ఆదర్శ పాఠశాలకు నిధులు విడుదలచేశారు.

గడువులోగా పూర్తికి చర్యలు- రాంకుమార్, డీఈవో. భూపాలపల్లి

పీఎంశ్రీ పథకం ద్వారా భూపాలపల్లి జిల్లాలోని మల్హర్ టీఎస్ మోడల్ స్కూల్‌లో సైన్స్ ల్యాబ్, అదనపు గది నిర్మాణం, ఇతర తరగతి గదుల మరమ్మతుల కోసం రూ.20.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఎస్ఎంసీల ద్వారా నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

# పల్లెలను వణికిస్తున్న జ్వరాలు

పెద్దపల్లి : జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఊహించినట్లుగానే డెంగీ కోరలు చాచింది. పరిసరాల పరిశుభ్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులతో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. ఇంటికొకరు దగ్గు, జ్వర లక్షణాలతో బాధ పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. మరోవైపు జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నెల రోజులుగా పల్లెలు, పట్టణాల్లో జ్వర సర్వే నిర్వహిస్తున్నారు. మొక్కుబడిగా మాత్రలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. రక్త నమూనాలు సేకరిస్తున్నా పరీక్షల నివేదికలు ఇవ్వడం లేదని రోగులు ఆవేదన చెందుతున్నారు.

ఇంటికొకరు బాధితులు

జిల్లాలో ఇంటికొకరు చొప్పున జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలతో అవస్థలు పడుతున్నారు. చలికాలం ప్రారంభమైనప్పటికీ పొద్దంతా భరించలేని ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పల్లెల్లో వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్, హైదరాబాద్ పట్టణాలకు వెళ్తున్నారు. ప్రైవేటులో వైద్యం కోసం రూ.వేలు వెచ్చించాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. వానలు తగ్గుముఖం పట్టినా మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదు. జనావాసాల మధ్య మురుగు నిలిచి ఉండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

388 బృందాలతో సర్వే

జిల్లాలో నెల రోజులుగా జ్వర సర్వే కొనసాగుతోంది. జిల్లావ్యాప్తంగా 388 బృందాలు ఇంటింటికీ వెళ్లి జ్వర పీడతుల వివరాలు సేకరిస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, ఇతర వ్యాధులతో బాధ పడుతున్న వారి నుంచి రోజుకు దాదాపు 6 వేల మంది వివరాలు ఆరా తీస్తున్నారు. అధిక లక్షణాలున్న వారి రక్త నమూనాలు సేకరించి నిర్ధారణ కోసం సమీపంలోని సామాజిక వైద్యశాలలకు పంపిస్తున్నారు. అయితే నివేదికల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. మందుల కిట్లను పంపిణీ చేస్తున్నామని అధికారులకు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు.

కోరలు చాచిన డెంగీ

జిల్లాను అయిదేళ్లుగా డెంగీ వణికిస్తోంది. ఏటా వానాకాలంలో పరిసరాల పరిశుభ్రతపై మొక్కుబడిగా అవగాహన కల్పిస్తున్నారు. ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణ చర్యలు చేపడుతున్నారు. మురుగు నిల్వ ప్రాంతాలను గుర్తించి తొలగిస్తున్నారు. అయినా ఏటికేడు డెంగీ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో 148 కేసులు నమోదైనట్లు అధికారిక గణంకాలు వెల్లడిస్తున్నా, ఇందుకు భిన్నంగా రెట్టింపు స్థాయిలో కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది.

మందుల కొరత లేదు

జిల్లాలో జ్వర సర్వే కొనసాగుతోంది. లక్షణాలకు అనుగుణంగా రక్త నమూనాలు సేకరిస్తున్నారు. కేసులు అధికంగా నమోదైన ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. జ్వరాలు అదుపులోనే ఉన్నాయి. ఎక్కడా మందుల కొరత లేదు.

# విజయ డెయిరీ.. వివాదాలపాలు

ఖమ్మం : ప్రభుత్వరంగ సంస్థ 'విజయ డెయిరీ' తరచూ వివాదాల పాలవుతోంది. అనుభవం, అర్హతలేని వారి వల్ల సంస్థకు నష్టం వాటిల్లుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెగ్యులర్ ఉద్యోగులు చాలామంది సస్పెన్షన్‌కు గురయ్యారు. ల్యాబ్‌లో పనిచేసే పొరుగు సేవల సీనియర్ ఉద్యోగులు ముగ్గురిని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తాజాగా బదిలీ చేయటం, వీరి స్థానంలో ప్రైవేటు డెయిరీల్లో పనిచేసే నలుగురిని అనుమతులు లేకుండా నియమించు



కోవటం అనుమానాలకు తావిస్తోంది. కొత్తగా నియమితులైన వారి ద్వారానే అక్రమాలకు పాల్పడుతున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.


తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎలాంటి అక్రమాలు జరగలేదు. గతంలో ఆరోపణలు ఎదుర్కొన్న వారిపై విచారణ జరిపించి కొందరు పొరుగుసేవల ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేశాం. డెయిరీని పటిష్ఠపరిచేందుకే కొంతమందిని కొత్తగా పొరుగుసేవల ఉద్యోగులుగా నియమించాం. అంతే తప్ప నియామకాల్లో అక్రమాలకు పాల్పడలేదు. సంస్థను దెబ్బతీసేందుకు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు.
కుమారస్వామి, డిప్యూటీ డైరెక్టర్, విజయడెయిరీ, ఖమ్మం

# వేసవిలో వన్యప్రాణికి రక్ష

సత్తుపల్లి : భవిష్యత్తు తరాల మనుగడకు అడవులు ఎంతో అవసరం. వన్యప్రాణులను కాపాడుకోవడమూ అంతే కీలకం. వేసవి వచ్చిందంటే చాలు దాహార్తితో జనారణ్యంలోకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి. అగ్నికీలల్లో ఆహుతి అయిపోతున్నాయి. వీటి నివారణే లక్ష్యంగా ప్రతి వేసవిలో అటవీశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. వన్యప్రాణుల దాహం తీర్చడంతోపాటు అడవుల సంరక్షణకు విశేష కృషి చేస్తోంది.

దాహార్తి తీరుస్తూ..

అడవుల్లో ప్రధానంగా ఫైర్‌లైన్లు ఏర్పాటు చేస్తూ వృక్ష, జంతుజాలానికి రక్షణ కల్పిస్తున్నారు. మరోవైపు వన్యప్రాణుల సౌకర్యార్థం అదనంగా నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌లు, ఫారంపాండ్లు, సాసర్ రింగ్స్, సోలార్ బోర్ వెల్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. పదిహేను రోజులకోసారి సాసర్ రింగ్స్‌లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. హరితహారంలో భాగంగా పచ్చదనాన్ని వృద్ధి చేయడం కోసం అటవీ శాఖ చేపట్టిన కృషి ఫలించింది. పక్షులు, జంతువుల మనుగడకు ఉమ్మడి జిల్లాలోని అడవులు దోహదపడుతున్నాయి. వాటి జీవనానికి అవసరమైన వాతావరణం నెలకొనడంతో వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరిస్తూ వాటి సంతతిని మరింతగా పెంచుకుంటున్నాయి. ఖమ్మం డివిజన్ పరిధిలోని మధిర, ఖమ్మం, కారేపల్లి, కూసుమంచి రేంజ్‌ల పరిధిలో 30,889.60 హెక్టార్లు, సత్తుపల్లి డివిజన్ పరిధిలోని తల్లాడ, సత్తుపల్లి రేంజ్ పరిధిలో



మరో 33,052.94 హెక్టార్లలో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలో అధికారులు ఈ వేసవిలో పకడ్బందీగా చర్యలు చేపట్టారు. 2021లో పెద్దపులి సైతం ఈ ప్రాంతంలో తిరగడంతో సదరు జాతికి అనుకూలంగా ఇక్కడి అడవులు రూపొందించినట్లుగా అధికారులు భావిస్తున్నారు.

స్వేచ్ఛగా సంచరించేలా..

ఉమ్మడి జిల్లాలోని దట్టమైన అడవుల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఎక్కువగా అడవి దున్నలు, దుప్పులు, కొండగొర్రెలు, కుందేళ్లు, అడవి పిల్లులు, రెండు రకాల పునుగు పిల్లులు, జింకలు, దుప్పులతోపాటు పక్షులు పెద్దఎత్తున సంచరిస్తున్నాయి. హరితహారంలో భాగంగా అడవుల్లో దాదాపు శాఖాహార జంతువులు, పక్షుల కోసం ఎక్కువగా శాతం నేరేడు, ఉసిరి, మారేడు, వెలగ, చింత, వేప, రావి, మర్రి వంటి పండ్ల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా పలు ప్రాంతాల్లో ఎరుమద్ది, నల్ల మద్ది, సింధుగ, లోలుగ, ఏగిస వంటి విత్తనాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఖమ్మం జిల్లాలో...2022–23లో మొత్తం 97 కి.మీ. నిడివిలో కొత్తగా ఫైర్‌లైన్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఫైర్‌లైన్ పనులు కొనసాగుతున్నాయి. గతంలో ఉన్న 272 కి.మీ. మేర ఫైర్‌లైన్లను నిర్వహిస్తున్నారు. గతేడాదిలో 61 సాసర్ పిట్స్‌ను ఏర్పాటు చేయగా ప్రస్తుతం పలు ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఉన్న 120 సాసర్ పిట్స్‌ను మరమ్మతులు చేయించి కొనసాగిస్తున్నారు. మూడు చెక్ డ్యామ్‌లు, ఒక సోలార్ బోర్‌వెల్, 599 రాతి ఆనకట్టలు, పది పెర్కోలేషన్ ట్యాంకులు, 14 నీటికుంటలు ఉండగా అవసరమైన ప్రాంతాల్లో గుర్తించి అదనంగా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తం

అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాల నివారణకు అధికారులు పలు చర్యలు చేపడుతున్నారు. సమీపంలో నివసిస్తున్న వారికి అడవుల ప్రాముఖ్యతను తెలుపుతూ అవగాహన కల్పిస్తున్నారు. కాపరులు కేవలం పశువుల మేత మేపేందుకు మాత్రమే అనుమతిస్తూ ఇతరులు అడవుల్లోకి వెళ్లకుండా బేస్ క్యాంపు సిబ్బందిచే చర్యలు చేపట్టారు. అడవుల్లో తేనె తీసేవారు, తునికాకు కార్మికులతో అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. మంటలు వ్యాపించకుండాఫైర్‌లైన్ల నిర్వహణపై దృష్టిపెట్టారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే శాటిలైట్ ద్వారా వచ్చే మెసేజ్ అలర్ట్‌తో ఆ ప్రాంతానికి చేరుకుని మంటలను నివారించేలా ఫైర్ బోయర్లను అందుబాటులో ఉంచారు. వన్యప్రాణుల కదలికలు గుర్తించడం కోసం నీటి కుంటల వద్ద కెమెరా ట్రాప్స్ అమర్చుతున్నారు.

సంరక్షణ బాధ్యత అందరిది

అడవులు, వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అడవులు, వన్యప్రాణుల రక్షణ కోసం పలు విధాల ఏర్పాట్లు చేస్తున్నాం. హరితహారాన్ని అందిపుచ్చుకుని పలు మారుజాతి మొక్కలతో పచ్చదనాన్ని వృద్ధి చేశాం. అడవులు, వన్యప్రాణులకు ముప్పు కల్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.
వెంకటేశ్వర్లు, రేంజర్, సత్తుపల్లి

# అనుసంధానం వేగవంతం



ఖమ్మం : హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓడరేవులు కలిగిన విశాఖపట్నం, కాకినాడ పట్టణాల అనుసంధానానికి దగ్గర దారి నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఖమ్మం–దేవరపల్లి మధ్య 162 కి.మీ. పొడవున నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి పూనుకుంది. ఏపీలో భాగమైన రోడ్డు నిర్మాణ పనులకు గతంలోనే శంకుస్థాపన జరిగింది. తెలంగాణలో భాగమైన ఖమ్మం–దేవరపల్లి రోడ్డుకు ప్రధాని మోదీ హైదరాబాద్‌లో శంకుస్థాపన చేయనున్నారు.

నిర్మాణం పూర్తయితే..గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తయితే హైదరాబాద్–విశాఖపట్నం, కాకినాడ మధ్య సరకు రవాణా వేగవంతమవుతుంది. ప్రస్తుతం విజయవాడ మీదుగా వాహనాలు వెళుతున్నాయి. కొత్త రోడ్డు అందుబాటులోకి వస్తే సుమారు 80 కి.మీ. దూరం తగ్గుతుంది. తెలంగాణలో ఖమ్మం– హైదరాబాద్ మధ్య ఈ రోడ్డుకు అనుసంధానంగా డ్రైపోర్ట్‌ల ఏర్పాటుకు అవకాశాలు మెరుగుపడతాయి.

ప్రతి ప్యాకేజీలో పనులు పూర్తి చేసేందుకు రెండేళ్ల గడువు విధించారు. 2022 సెప్టెంబర్, అక్టోబర్ చివరన నిర్మాణ సంస్థలు పనులు ప్రారంభించాయి. 2024 నవంబర్ నాటికి పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు.

జాతీయ రహదారి వివరాలు

జిల్లాలో 105.23 కి.మీ. పొడవున నాలుగు వరుసల్లో రోడ్డు నిర్మించనున్నారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్ వరకు ఉన్న సూర్యాపేట– ఖమ్మం జాతీయ రహదారికి కొనసాగింపుగా పొన్నేకల్ నుంచి వెంకటగిరి క్రాస్‌రోడ్డు, గుదిమళ్ల నుంచి మున్నేరు మీదుగా ఖమ్మం అర్బన్, చింతకాని, కొణిజర్ల, వైరా, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలం తుంబూరు వరకు రోడ్డు నిర్మిస్తారు. తుంబూరు తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చింతలపుడి మండలం లింగగూడెంలో ప్రవేశించి దేవరపల్లి వరకు కొనసాగి అక్కడ విజయవాడ, కొవ్వూరు జాతీయ రహదారికి అనుసంధానమవుతుంది. ఖమ్మం జిల్లాలో నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా విభజించారు. రూ.2,760.85 కోట్లతో గుత్తేదారు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. జిల్లాలో ఏడు మేజర్ వంతెనలు, 30 మైనర్ వంతెనలు, ఒక ఆర్వోబీ నిర్మించనున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేపైకి వాహనాలు ప్రవేశించేందుకు ఐదు ఇంటర్ ఛేంజెస్ మార్గాలు ఏర్పాటుచేస్తారు. ఖమ్మం– దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఎన్‌హెచ్–365 బీజీ నంబర్ కేటాయించారు.

రోడ్డు నిర్మాణానికి జిల్లాలో 1,300 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించారు. భూమి కోల్పోయిన వారికి రూ.419 కోట్ల పరిహారం చెల్లించాలి. రూ.411 కోట్లు పంపిణీ చేశారు. మిగతా ప్రక్రియ కొనసాగుతోంది.

రోడ్డు నిర్మాణానికి 2018 మేలో ప్రధానమంత్రి ఆమోదించారు. మూడు పంటలు పండే భూములు ఇచ్చేందుకు తొలుత రైతులు నిరాకరించారు. రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు. కొవిడ్ సమయంలో భూ సేకరణ ప్రక్రియ నెమ్మదించినా తదనంతరం పోలీసు బందోబస్తు మధ్య రైతులు భూములు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు ఆహ్వానించి గుత్తేదారు సంస్థలను ఖరారు చేశారు.

# పాతాళానికి గంగ.. పట్టణాల్లో బెంగ



ఖమ్మం : జల్‌శక్తి అభియాన్ పేరిట భూగర్భజల సంరక్షణకు 2017 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాన్ని అమలుచేస్తున్నాయి. రైతులు, గ్రామీణులు, పట్టణ వాసుల్లో అవగాహన కల్పిస్తున్నాయి. భద్రాద్రి జిల్లాలో 3,125, ఖమ్మం జిల్లాలో 1,683 జలవనరులున్నట్లు కేంద్ర జల్‌శక్తి శాఖ తాజాగా విడుదల చేసిన తొలి వాటర్‌బాడీస్ సెన్సస్ నివేదిక చెబుతోంది. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లో భూగర్భజలం తక్కువ ఉన్నట్లు స్పష్టమవుతోంది. పట్టణ జనాభా విస్తరించడం, కాంక్రీటు నిర్మాణాలు పెరగడం, నివాసాల్లో ఇంకుడుగుంతలు లేకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఏటా కురుస్తున్న వర్షాలకు జలవనరులు నిండకపోగా.. సహజసిద్ధంగా ఏర్పడిన వనరుల్లో సైతం జలం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.నివేదికలోని ముఖ్యాంశాలు.. ఉభయ జిల్లాల్లో అనేక చెరువులు ఆక్రమణల చెరలో ఉన్నాయి. సహజసిద్ధంగా ప్రవహించే వాగులు సైతం ఆక్రమణలకు గురయ్యాయి. కొన్నింటి దారి మళ్లింది. 2017–18 నాటి గణాంకాల ఆధారంగా నీటి నిల్వలను లెక్కించగా జలవనరుల్లో 42% సగభాగం, 25% పూర్తిగా, మూడోవంతు 23%, నాలుగోవంతు 10% నిండి ఉన్నాయి. ఆక్రమణకు గురైన వాటిలో చెరువులు 18%, కుంటలు 27%, నీటి సంరక్షణ పథకాలు 33%, చెక్‌డ్యాంలు 22% ఉన్నాయి. అందుబాటులో ఉన్న జలవనరుల్లో 73% వినియోగంలో ఉండగా 27% నిరుపయోగంగా మారాయి. ఎండిపోవడం, పూడికతీత లేకపోవడం, ఉప్పు, ఇతర ద్రవాల శాతం ఎక్కువగా ఉండటం వల్ల జలవనరులను వినియోగించటం లేదు. ఎక్కువగా సాగునీటికి (55.30%), తర్వాత భూగర్భజలాల రీఛార్జ్‌కు (38.52%) ఉపయోగపడుతున్నాయి.

# ఆరంభంలోనే తగ్గిన ధర

జగిత్యాల : మామిడి సీజన్ ఆరంభంలోనే ధరలు అమాంతం తగ్గటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బంగినపల్లి రకానికి కిలోకు రూ.60–70 వరకు పలికిన ధరలు ప్రస్తుతం రూ.40 కన్నా దిగువకు పడిపోవటంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కాయలను కొనుగోలు చేసిన వ్యాపారులు గ్రేడింగ్, ప్యాకింగ్‌చేసి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుండగా మామిడి కాయల క్రయవిక్రయాలు పెరిగే తరుణంలో ధరాఘాతం వేధిస్తోంది.తగ్గిన కాతజ జగిత్యాల జిల్లాలో 35 వేల ఎకరాల్లో మామిడి కాపు ఉండగా 1.32 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావాలి. ఈ సీజన్‌లో తొలుత పూత బాగానే వచ్చినా చలి, ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, తేనెమంచు, బూడిద తెగులు, తామర పురుగుల ప్రభావం, రాళ్లవానలు, అకాలవర్షం, ఈదురు గాలులతో పూత, పిందెలు పెద్దఎత్తున రాలిపోయాయి. తోటనుబట్టి సగం వరకు పూత, పిందె రాలిపోయి నష్టం వాటిలినట్లు రైతులు, తోటల గుత్తేదారులు పేర్కొనటం ప్రతికూల పరిస్థితిని వెల్లడిస్తోంది. ఈ నేపథ్యంలో మామిడి మండీకి కూడా కాయలు చాలా తక్కువగానే అమ్మకానికి వస్తాయని అంచనా వేస్తుండగా గత కొన్ని సీజన్లుగా మామిడికి ప్రతికూల వాతావరణం నెలకొని దిగుబడులు గణనీయంగా తగ్గుతుండటంతో గొల్లపల్లి తదితర మండలాల రైతులు తోటలను పెద్దఎత్తున నరికివేసి ఇతర పంటలకు మళ్లుతున్నారు.

కాయల ఎగుమతి

జగిత్యాలతో పాటుగా మెట్పల్లి, కోరుట్ల, మేడిపల్లి, రాయికల్, గొల్లపల్లి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు కాయలను కొనుగోలు చేస్తారు. మార్కెట్లతో పాటుగా నేరుగా తోటల నుంచి కూడా కాయలను సేకరించి పెట్టెల్లో నింపి తరలిస్తారు. స్థానికంగా ధరల్లేనపుడు రైతులు కూడా తమ కాయలను నాగ్‌పూర్, హైదరాబాద్ తదితర మార్కెట్లకు తీసుకెళ్లి విక్రయిస్తారు. ఈ నేపథ్యంలో చల్‌గల్‌లో లక్ష చదరపు అడుగుల్లో సిద్ధమైన షెడ్లు అందుబాటులోకి రావటం, వాలంతరి ప్రదర్శనక్షేత్రం నుంచి తీసుకున్న స్థలాన్ని దశలవారీగా అభివృద్ధి చేయనుండటం కలిసివచ్చే అంశాలుగా ఉన్నా ధరాఘాతం రైతులను, తోటల గుత్తేదారులను వేధిస్తోంది. అకాలవర్షాల భయంతో త్వరితంగానే కాయలను తెంపి విక్రయిద్దామన్నా ప్రస్తుత ధరలు ప్రతికూలంగా మారాయి.

తగిన చర్యలుండాలి స్థానికంగా ధరలు తగ్గినపుడు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అనువుగా జిల్లాలోని మామిడి కొనుగోలు కేంద్రాల్లో దేశవ్యాప్త మామిడి మార్కెట్ల ధరలు తెలిసేలా ఆన్‌లైన్ తెరలను ఏర్పాటు చేయాలి. కాయల గ్రేడింగ్, ప్యాకింగ్ తదుపరి లారీలు, ట్రక్కులు, కిసాన్‌రైలు ద్వారా దిల్లీ కేంద్రంగా ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతిని పెంచటం ధరల్లో స్థిరత్వాన్ని తేనుంది. స్థానిక వ్యాపారులు ఒకేధరను చెప్పేందుకు వీలులేకుండా దూరప్రాంత వ్యాపారులను కొనుగోళ్లకు రప్పించాలి. అపెడ, ఉద్యానశాఖ, ఎఫ్‌పీవోలు, మహిళా సంఘాల ద్వారా మామిడిని కొనుగోలు చేసి మాల్స్, ఉప ఉత్పత్తుల తయారీ కంపెనీలకు తరలిస్తే అధిక ధరలు దక్కుతాయి. ఎలాంటి పండ్లయినా కాల్షియం కార్బైయిడ్‌తో మాగేయవద్దని సర్వోన్నత న్యాయస్థానం తీర్పును వెలువరించినా గత సీజన్లలో కొన్నిచోట్ల కార్బయిడ్ వాడకం గుట్టుగా సాగింది. మరోవైపు శాస్త్రీయత లేని చైనాపొడిని కూడా కొందరు వాడుతున్నారు. ప్రభుత్వం అనుమతించిన ఇథలిన్ గ్యాస్ లేదా రసాయనం ద్వారా కాయలను పండ్లుగా మార్చినపుడు వీటిని తిన్నవారి ఆరోగ్యాలు బాగుంటాయి. ఈ నేపథ్యంలో అపెడా, రైతులు, ఎఫ్‌పీవోలు, మహిళా సంఘాల ద్వారా సేకరించిన మామిడి కాయలను చల్‌గల్‌లోని రైపెనింగ్ ఛాంబర్‌లో మాగేసి నాణ్యమైన పండ్లను జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లోనూ విక్రయించే వీలుంది.

# 'జాతీయ ఉత్తమ ఆరోగ్య పంచాయతీ'గా గౌతంపూర్

కొత్తగూడెం : 'జాతీయ పంచాయతీ పురస్కారాలు–2021–22'లో జాతీయ స్థాయిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మెరిసింది. పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, బాలల హిత, నీటి సమృద్ధి, పరిశుభ్రత–పచ్చదనం, స్వయం సమృద్ధి, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళా హితం అనే తొమ్మిది అంశాలను ప్రాతిపదికగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ పురస్కారాలు ప్రకటిస్తున్న విషయం విధితమే. గత సంవత్సరానికి గాను 'ఆరోగ్యం' విభాగంలో ఇటీవల రాష్ట్రస్థాయి పురస్కారాన్ని దక్కించుకున్న చుంచుపల్లి మండలంలోని గౌతంపూర్ పంచాయతీ జాతీయ స్థాయిలోనే అగ్రస్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం. వంద శాతం మార్కులు సాధించిన ఈ గ్రామం.. జాతీయ ఉత్తమ ఆరోగ్య పంచాయతీగా ఎంపికైంది. ఈ సమాచారాన్ని పురస్కా



రాల జాతీయ కమిటీ వెల్లడించినట్లు జిల్లా పంచాయతీ అధికారులు ధ్రువీకరించారు. త్వరలో నగదు పురస్కారంతో పాటు అవార్డు అందజేయనున్నట్లు చెప్పారు.

కలెక్టర్ అభినందన: గౌతంపూర్ పంచాయతీ పాలకవర్గం, అధికారులు సింగరేణి సౌజన్యంతో పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణ, శుద్ధి జలాల సరఫరా, మెరుగైన వైద్య సేవలకు కృషి చేస్తూ జాతీయ ఉత్తమ పురస్కారానికి ఎంపిక కావడం అభినందనీయమని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఇదే స్ఫూర్తితో అన్ని పంచాయతీల పాలకవర్గాలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. పురస్కారానికి ఎంపికైన సందర్భంగా సర్పంచి పొడియం సుజాత, కార్యదర్శి జక్కంపూడి షర్మిల, డీపీఓ రమాకాంత్, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, ఎంపీఓ సత్యనారాయణ, డీఎంహెచ్ఓ శిరీష, ఏఎన్‌ఎంలు విజయకుమారి, బి.తులసి, కౌసల్య, కాంతామణి, ఆశాకార్యకర్తలను ప్రత్యేకంగా అభినందించారు.

# విభాగినుల నిర్మాణంలో నాణ్యతేదీ?

జనగామ : జనగామలో ప్రమాదాల నివారణ, రద్దీ నియంత్రణే లక్ష్యంగా నిర్మించిన విభాగినుల ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. రూ.కోట్ల వ్యయంతో పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఒక వైపు విభాగినుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరోవైపు ఇప్పటికే నిర్మించిన విభాగినులు నిర్వహణ లోపంతో, నాణ్యత లేమితో దెబ్బతింటున్నాయి. ప్రత్యేక నిధులతో..పట్టణ సుందరీకరణ, అభివృద్ధి పథకంలో భాగంగా తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ నుంచి రూ.30 కోట్లు మంజూరయ్యాయి. గత శాసనసభ ఎన్నికల ముందు మంజూరైన పనుల్లో భాగంగా పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారుల్లో రూ.7.80 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు ప్రధాన రహదారుల్లో సుమారు 9.5 కి.మీ మేర ఆరు ప్యాకేజీలుగా పనులు జరగాలి. ఇందులో చౌరస్తా నుంచి నెహ్రూపార్కు, హనుమకొండ, సూర్యాపేట రహదారిలో పనులు పూర్తయ్యాయి. హైదరాబాద్ రోడ్డులో చౌరస్తా నుంచి హౌసింగ్ బోర్డు వరకు పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. అక్కడి నుంచి బైపాస్ వరకు పని మందకొడిగా సాగుతోంది. ఇదిలా ఉంటే..బయటపడుతున్న లోపాలు

ఏడాది, రెండేళ్ల క్రితం నిర్మాణం పూర్తయిన విభాగిని పనులు నాసిరకంగా ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. పనులు వివిధ దశల్లో ఉన్నప్పుడే వీటిపై పలు కథనాలు ప్రచురితమయ్యాయి. ప్రజారోగ్యశాఖ అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేశారు. మూడో



బృందం(థర్డ్‌పార్టీ) పత్తాలేని వైనాన్ని ఎండగట్టగా, మమ అన్నరీతిలో పరీక్షించారు. ప్రస్తుతం అనేక చోట్ల విభాగినులపై చేసిన సిమెంటు కప్పు కోపింగ్(రాతి కట్టడంపై ఇరువైపులా సిమెంటు స్లాబ్) కూలిపోతోంది. హనుమకొండ రోడ్డులో పారిశ్రామికవాడ క్రాస్ రోడ్డు వద్ద సీసీ కప్పు గోడల మీది నుంచి పైకి లేచింది. ప్రధాన రహదారుల్లో నిబంధనలకు విరుద్ధంగా పాదచారులు అడ్డదిడ్డంగా విభాగిని దాటేందుకు కొంత స్థలాన్ని వదిలారు. ఇలాంటి ఖాళీ స్థలాల వద్ద మట్టి జారిపోతోంది. రాళ్లు కదిలిపోతున్నాయి. బస్టాండు సమీపంలోనూ, ఓ చిన్నపిల్లల క్లినిక్ సమీపంలో నవజాత శిశువులను ఒడిలో పెట్టుకొని మహిళలు ప్రమాదకర స్థితిలో గోడలు, రోడ్డు దాటుతున్నారు. హనుమకొండ, సూర్యాపేట రోడ్డులోని విభాగిని కూడళ్ల వద్ద రాళ్లు కదిలి పగుళ్లు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల వాహనాలు తగలడంతో ఇలా జరిగిందంటున్నారు. మూల మలుపుల వద్దనే కాకుండా, మధ్యలోనూ రాళ్లు ఊడిపోయే స్థితిలో ఉన్నాయి. నిర్మాణ సమయంలో క్యూరింగ్ సరిగా లేకపోవడం, నాసిరకం సామగ్రి, నాణ్యత లేని రీతిలో పనులు జరగడం వల్లే, విభాగినుల ఉనికి ప్రశ్నార్థకమవుతోందంటున్నారు.

పరిశీలించి కౌన్సిల్‌కు నివేదిస్తా..
–డీఈ చంద్రమౌళి

విభాగినులను వాహనాలు ఢీకొనడం వల్ల అనేక చోట్ల దెబ్బతింటున్నట్లు మా దృష్టికి వచ్చింది. లోపాలను పరిశీలించి కౌన్సిల్‌కు నివేదిస్తా. పచ్చదనం పెంపులో లోపాలను సవరిస్తాం.

రూ.లక్షలు పోసికోనోకార్పస్ చెట్ల తొలగింపునకు సుమారు రూ.5 లక్షలు ఖర్చయ్యాయి. వాటి స్థానంలో సూర్యాపేట, హనుమకొండ, సిద్దిపేట రోడ్డులో వంతెనపైన మొక్కల ఏర్పాటుకు రూ.15 లక్షలు వెచ్చించారు. హనుమకొండ రోడ్డులో బస్టాండు నుంచి ఎల్లమ్మ ఆలయం వరకు మొక్కలున్నట్లు లెక్కలున్నా, ఏసీపీ కార్యాలయం క్రాస్ వరకు మాత్రమే మొక్కలు నాటారు. మొక్కలకు రోజూ నీళ్లు పోస్తున్నా, అనేక చోట్ల నాటిన అలంకరణ మొక్కల చుట్టూ గడ్డి పెరిగింది. అసలు మొక్కలు కనిపించడం లేదు. అనేక చోట్ల విభాగిని గోడల నుంచి మట్టి కొట్టుకుపోతోంది.




హైదరాబాద్: తెదేపా అధినేత చంద్రబాబుకు బాసటగా హైదరాబాద్‌లోని మెట్రో స్టేషన్‌ల వద్దకు ఇవాళ ఆయన అభిమానులు, ఐటీ ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ 'లెట్స్ మెట్రో ఫర్ సీబీఎన్' పేరుతో కార్యక్రమం తలపెట్టారు. ఇందులో భాగంగా ఉదయం 10.30 – 11.30 గంటల మధ్య మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకూ నల్ల టీషర్టులు ధరించి మెట్రోలో ప్రయాణించి నిరసన తెలిపారు. తొలుత మెట్రో స్టేషన్‌ల వద్దకు చంద్రబాబు అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రవేశాల వద్ద బందోబస్తు నిర్వహించి నల్ల చొక్కాలు ధరించిన వారిని లోనికి అనుమతించలేదు.

**మెట్రో స్టేషన్ తాత్కాలికంగా మూసివేత :** ఈ క్రమంలో మియాపూర్ మెట్రో స్టేషన్ సహా అమీర్‌పేట్‌లో మెట్ల దారిని సిబ్బంది కాసేపు తాత్కాలికంగా మూసివేశారు. ఆ తర్వాత ప్రయాణికులను అనుమతించారు. మరోవైపు ఎల్బీనగర్ మెట్రోస్టేషన్ వద్ద నల్ల టీషర్ట్ వేసుకొని వచ్చిన యువకులను అడ్డుకోవడంతో.. పక్కనే ఉన్న డీ – మార్టులోకి వెళ్లి ఇతర రంగు టీషర్ట్‌లు కొనుగోలు చేసి వచ్చారు. ఇలా మొత్తానికి ఎలాగోలా చంద్రబాబు బాసటగా ఐటీ ఉద్యోగులు, అభిమానులు పెద్దసంఖ్యలో మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకు మెట్రోలో ప్రయాణించారు. 'వీ వాంట్ జస్టిస్' అంటూ వైకాపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని నినదించారు.

**జగన్ అరాచకాన్ని అందరూ ఖండిస్తున్నారు: ఉండవల్లి శ్రీదేవి –** చంద్రబాబుకు మద్దతుగా ఏపీకి చెందిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి.. మియాపూర్ స్టేషన్‌కు వచ్చారు. చంద్రబాబు ప్రాణానికి ముప్పు ఉందని.. అందువల్లే ఒక ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా కార్యక్రమానికి వచ్చినట్లు తెలిపారు. ఏపీలో సీఎం జగన్ అరాచకాన్ని తెలంగాణ సహా అన్ని ప్రాంతాల్లో ప్రజలంతా ఖండిస్తున్నారని తెలిపారు. అభిమాను లతో కలిసి మెట్రోలో తెదేపా నేత తిరునగరి జ్యోత్స్న సైతం ప్రయాణించారు. శాంతియుత నిరసనను పోలీసులు అడ్డుకోవడం సరైంది కాదన్నారు.

**టికెట్లు ఇవ్వకుండా..** మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వచ్చిన ఐటీ ఉద్యోగులు తిరిగి వెళ్లేందుకు యత్నించగా.. టికెట్ ఇవ్వకుండా పోలీసులు, మెట్రో సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. బస్సుల్లో వెళ్లాలంటూ ఐటీ ఉద్యోగులకు పోలీసులు సూచించారు. అయితే మెట్రోలోనే వెళ్తామంటూ ఎల్బీనగర్ వద్ద ఐటీ ఉద్యోగుల నిరసన చేపట్టారు. అంతకుముందు అమీర్‌పేట్, మధురానగర్‌తో సహా పలు చోట్ల ఐటీ ఉద్యోగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# 16న సీఎం జగన్ విశాఖ, అనకాపల్లి జిల్లాల పర్యటన



అమరావతి: సీఎం వైఎస్ జగన్ ఈ నెల 16న (సోమవారం) విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి విశాఖ చేరుకుని మధురవాడ ఐటీ హిల్ నంబర్ 2 వద్ద ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం హెలిప్యాడ్ వద్ద జీవీఎంసీ బీచ్ క్లీనింగ్ మిషన్లు ప్రారంభిస్తారు.

అక్కడి నుంచి బయలుదేరి అనకాపల్లి జిల్లా పరవాడ చేరుకుని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో యుజియా స్టెరైల్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభోత్సవంలోను, అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలోను పాల్గొంటారు. తరువాత అచ్యుతాపురం ఏపీసెజ్‌కు చేరుకుని లారస్ ల్యాబ్స్ యూనిట్ 2 ఫార్ములేషన్ బ్లాక్ ప్రారంభిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం సాయంత్రం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

# టీడీపీ సింగిల్‌గా పోటీ చేయొచ్చు కదా?



ప్రకాశం: టీడీపీ ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న పార్టీ... సింగిల్‌గా పోటీ చేయొచ్చు కదా అని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. అన్ని పార్టీలు కలిసి వైసీపీపై పోటీ చేస్తున్నాయన్నారు. ఒంగోలు, దర్శి, గిద్దలూరులో జనసేన ప్రభావం ఉంటుందని.. అయినా ఆ నియోజక వర్గాల్లో కూడా తాము గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు వెయిట్ తగ్గారని టీడీపీ నాయకులు చెబుతున్నారని.. డాక్టర్లు వెయిట్ తగ్గలేదని చెబుతున్నారన్నారు. చంద్రబాబుకు సమస్య ఉంటే ఖచ్చితంగా హాస్పటల్‌కు తీసుకువెళ్లి చికిత్స చేస్తారని.. కావాలని జైలులో ఉంచి ఇబ్బంది పెట్టే కార్యక్రమం ఎవరూ చెయ్యరని చెప్పుకొచ్చారు. ఇబ్బందికర పరిస్థితుల్లో ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదని తన ఉద్దేశమన్నారు. వైసీపీ కార్యకర్తలపై నెపం వేసి సస్పెండ్ చేస్తే వారికి అండగా ఉంటానన్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వారిని తిరిగి పార్టీలోకి తీసుకోవాలని చెప్పానని బాలినేని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

# చంద్రబాబు తెలుగు ప్రజల వారసత్వ ఆస్తి




తిరుపతి: టీడీపీ అధినేత చంద్రబాబు తెలుగు ప్రజల వారసత్వ ఆస్తి అని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఆయనను కాపాడుకోవాలసిన బాధ్యత మన అందరిదన్నారు. జగన్ ఫ్యాక్షన్ రాజకీయాలను తిప్పికొట్టే రోజు దగ్గర పడిందన్నారు. జైలులో అనారోగ్యంతో బాధపడుతున్న చంద్రబాబుపై గేలిగా మాట్లాడి... వైసీపీ మరింత దిగజారిందని మండిపడ్డారు. ప్రెస్‌క్లబ్‌లోకి వీర మహిళలను అరెస్టు చేయాల్సిన అవసరం ఏం వచ్చిందని ప్రశ్నించారు. తిరుపతిలో పోలీసు అధికారుల తీరును సుగుణమ్మ తప్పు పట్టారు.

తమ దిష్టి బొమ్మల్ని కాల్చి సమయంలో మిన్నుకుండిన పోలీసులు... ప్రభుత్వ దిష్టి బొమ్మ కాల్చితే టీడీపీ కార్యకర్తలపై హత్యాయత్నం కేసు పెట్టడం జరిగిందన్నారు. శ్రీవారి సొమ్ములో ఒక శాతం కప్పం కట్టించుకునేందుకు టీటీడీ చైర్మెన్ కరుణాకరరెడ్డి ఈ వ్యవహారం సాగిస్తున్నారని సుగుణమ్మ వ్యాఖ్యలు చేశారు.

# నికిమాలిన చెత్త సలహాదారుడు సజ్జల



రాజమండ్రి: పనికిమాలిన చెత్త సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి అంటూ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కేవలం ప్రభుత్వ సంపాదన దోచుకోవటమే తెలిసిన వ్యక్తి సజ్జల రామకృష్ణారెడ్డి అంటూ వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు ఆరోగ్యం కోసమే భయపడుతున్నామన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌ను లక్షలాది మంది మహిళలతో ముట్టడిస్తామని అన్నారు. రాజమండ్రిలో అత్యధిక ఉష్ణోగ్రత ఉందని తెలిపారు. జగన్ తప్పుడు ప్రచారం ఆపాలని.. జగన్ తిన్న సొమ్మంతా కక్కిస్తామన్నారు. జగన్ తాత, చెల్లి షర్మిళ రెండు పెళ్ళిళ్ళు చేసుకున్నారని.. పవన్ కళ్యాణ్ పెళ్ళిళ్ళు కోసం జగన్ మాట్లాడటం సిగ్గుచేటని గోరంట్ల బుచ్చయ్య చౌదరి వ్యాఖ్యలు చేశారు.

# చంద్రబాబును అంతమొందించే కుట్ర జరుగుతోంది : నారా లోకేశ్



అమరావతి : అనారోగ్య కారణాలతో తెదేపా అధినేత చంద్రబాబును అంతమొందించే కుట్ర జరుగుతోందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ.. చంద్రబాబును రిమాండ్‌లోనే ఉంచాలనే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. 'చంద్రబాబు జీవితం ప్రమాదంలో ఉంది.

భద్రతలేని జైలులో ఆరోగ్యం క్షీణించేలా చేసి ప్రాణహాని తలపెడుతున్నారు. ఏ తప్పూ చేయని చంద్రబాబు పట్ల ఈ ప్రభుత్వం రాక్షసంగా వ్యవహరిస్తోంది. చంద్రబాబు ఆరోగ్యంపై జైలు అధికారుల తీరు సందేహాస్పదంగా ఉంది. చంద్రబాబుకు ఏ హాని జరిగినా.. జగన్ సర్కార్, జైలు అధికారులదే బాధ్యత. చంద్రబాబు ఆరోగ్యంపై ఎందుకీ కక్ష?' అని లోకేశ్ ప్రశ్నించారు. 'జైలులో దోమలు ఎక్కువ ఉన్నాయన్నా అధికారులు పట్టించుకోలేదు. చన్నీళ్లు ఇస్తున్నారనన్నా లెక్క చేయలేదు. సరిగా తిరగని ఫ్యాన్ పెట్టారు. చంద్రబాబు బరువు తగ్గిపోయారు. అలర్జీ వచ్చింది. డీ హైడ్రేషన్‌కు గురయ్యారు. జైలు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి' అని లోకేశ్ మండిపడ్డారు.

# మద్యం కంపెనీల యజమానుల పేర్లు ప్రజాక్షేత్రంలో పెట్టగలరా?: పురందేశ్వరి



విజయవాడ: ఏపీలో మద్యం తయారీ కంపెనీల యజమానుల పేర్లు ప్రజాక్షేత్రంలో పెట్టగలరా? అని రాష్ట్ర భాజపా అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రశ్నించారు. ఇవాళ సాయంత్రానికల్లా కంపెనీ యజమానుల పేర్లు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. విజయవాడలో మీడియాతో ఆమె మాట్లాడారు.


ఆ కంపెనీల యజమానులంతా వైకాపా వాళ్లేనని వేరే చెప్పనవసరం లేదని దుయ్యబట్టారు. ధైర్యం ఉంటే మద్యం కంపెనీల యజమానుల పేర్లన్నీ బయటపెట్లాని సవాల్ విసిరారు. మద్యం తయారు చేసినా.. అమ్మినా ఏడేళ్ల జైలు శిక్ష విధించాలని గతంలో సీఎం జగన్ చెప్పారని ఈ సందర్భంగా పురందేశ్వరి గుర్తుచేశారు.

# చంద్రబాబు ఆరోగ్యంపై ఎగతాళిగా మాట్లాడతారా?: సీపీఐ రామకృష్ణ



విజయవాడ: తెదేపా అధినేత చంద్రబాబు ఆరోగ్యంపై రాజకీయం చేయడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఆయన ఆరోగ్యం బాలేదంటే ఎగతాళిగా మాట్లాడతారా?అని మండిపడ్డారు. ఆరోగ్యంపై వైద్యులు చెప్పాలి గానీ.. డీఐజీ ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. మరోవైపు, ఏపీలో నీటిపారుదల ప్రాజెక్టులను వైకాపా ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. "కృష్ణా జలాల అంశంపై హర్షం వ్యక్తం చేస్తూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సదస్సు పెడుతున్నారు. ప్రధానికి ధన్యవాదాలు తెలుపుతూ తెలంగాణలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. కేంద్ర కేబినెట్ పునఃపంపిణీ నిర్ణయం తీసుకున్నప్పుడు సీఎం జగన్ దిల్లీలోనే ఉన్నారు. దిల్లీలో ఉండి మరీ దీనిని అడ్డుకోవడంలో జగన్ విఫలమయ్యారు. తెలంగాణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు" అని సీపీఐ రామకృష్ణ విమర్శించారు.

# చంద్రబాబు బరువు పెరిగారంటూ వైసీపీ నేతల వెటకారం..



విజయనగరం : టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోగ్యంపై వైసీపీ నేతలు వెటకారం చేస్తున్నారని మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఆరోగ్యం బాగాలేదంటే ఆసుపత్రికి వెళ్లనీయకపోవటం బుద్ధీ, జ్ఞానం లేని చర్య అని అన్నారు. బరువు పెరిగారంటూ వ్యగ్యంగా మాట్లాడుతున్నారన్నారు. ఆయన వయస్సును బట్టి ఆరోగ్య సమస్యలు రావడం సహజమని.. అదే తమకు ఆందోళనగా ఉందని అశోక్ గజపతిరాజు అన్నారు. జగన్ 16 నెలలు పాటు జైల్లో ఉన్న విషయం మర్చిపోయారా..? అని ప్రశ్నించారు. పదేళ్లుగా బెయిల్ పై ఉన్న నాయకుడు జగన్ తప్ప దేశంలో ఇంకెవరైనా ఉన్నారా? అని అడిగారు. చంద్రబాబును జైల్లో పెట్టి, ఆయన చేసిన నేరం ఏమిటో ఇప్పటికీ నిరూపించలేకపోయారని అశోక్ గజపతిరాజు అన్నారు.




రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న తెదేపా అధినేత చంద్రబాబు ఆరోగ్య పరిస్థితికి సంబంధించి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల కీలక నివేదిక బయటకు వచ్చింది. జైలు అధికారులు, ప్రభుత్వ అధికారులు చెబుతున్న దానికి భిన్నంగా వైద్యుల నివేదిక ఉంది. చంద్రబాబు ఛాతీ, చేతులు, మెడ, గడ్డం, వీపు తదితర శరీరభాగాల్లో దద్దుర్లు, స్కిన్ అలర్జీ ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. ఈనెల 12న సాయంత్రం 4.30గంటలకు జీజీహెచ్ సూపరింటెండెంట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అదే రోజు సాయంత్రం 5 నుంచి 5.30గంటల వరకు పరీక్షించి.. జి.సూర్యనారాయణ, వి.సునీతదేవిలతో కూడిన వైద్యుల బృందం జైలు అధికారులకు నివేదిక అందజేసింది. చంద్రబాబుకు చల్లని వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వివిధ రకాల మందులను వైద్యులు సిఫార్సు చేశారు.

**డీహైడ్రేషన్‌తో గుండెపైనా ప్రభావం పడే అవకాశం.. చంద్రబాబు వ్యక్తిగత వైద్యులు :** రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యుల నివేదిక ప్రకారం చంద్రబాబుకు ఆరోగ్యసమస్యలు తీవ్రంగా ఉన్నట్టు ఆయన వ్యక్తిగత వైద్యులు స్పష్టం చేస్తున్నారు. వైద్యుల నివేదికను బయటపెట్టకుండా ఇప్పటి వరకు అంతా బాగుందంటూ జైలు అధికారులు చెబుతున్నారని కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు. అధికారులు చెబుతున్న దానికి భిన్నంగా చంద్రబాబును పరీక్షించిన వైద్యుల నివేదిక ఉందని ఆయన వ్యక్తిగత వైద్యులు తేల్చి చెబుతున్నారు. తీవ్రమైన ఎండల కారణంగా కొద్ది రోజులుగా డీహైడ్రేషన్‌తో చంద్రబాబు ఇబ్బంది పడుతున్నారని వారు అభిప్రాయపడుతున్నారు. చంద్రబాబుకి హైపర్ ట్రోపిక్ కార్డియో మైయోపతి సమస్య ఉందని, ఈ సమస్య కారణంగా డీహైడ్రేషన్‌తో గుండెపైనా ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు ఆరోగ్య సమస్యలను ప్రభుత్వం, అధికారులు.. చిన్నవి చేసి చూపిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బయటపడిన డాక్టర్ల నివేదికతో చంద్రబాబు ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణుల్లో ఆందోళన మరింత పెరిగింది.

# న్యాయస్థానాలు భయపడి వీరికి బెయిల్ మంజూరు చెయ్యాలా..?



తిరుమల : మానవతా దృక్పథంతో మా ప్రభుత్వం టీడీపీ అధినేత చంద్రబాబుకి జైల్లో అన్ని సౌకర్యలను కల్పిస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఓ ఆర్థిక నేరస్థుడికి జైల్లో ఇన్ని సౌకర్యాలను కల్పించడం తాను ఎప్పుడు చూడలేదన్నారు. న్యాయస్థానాలు, ప్రభుత్వ న్యాయవాదుల పైన దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఓ కులానికి సంబంధించిన వ్యక్తి ఆర్థిక నేరాలు చేసినా.. శిక్ష పడకూడదని ఆందోళనలు చేస్తున్నారన్నారు. న్యాయస్థానాలు భయపడి వీరికి బెయిల్ మంజూరు చెయ్యాలా..? అని నారాయణ స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జయలలిత, లాలూ ప్రసాద్ యాదవ్ జైలుకి వెళ్ళలేదా..? అని ప్రశ్నించారు. బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి టీడీపీకీ కోవర్ట్‌గా పని చేస్తున్నారని ఆరోపించారు. అవినీతి పై పోరాటం చేస్తానన్న పవన్ కళ్యాణ్.. బాబుకి మద్దతు ఇస్తున్నాడని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు.

## మకాం మార్చిన మంచు లక్ష్మి.. ఇకపై అక్కడే

మంచు లక్ష్మీ హైదరాబాద్ నుంచి ముంబకి మకాం మార్చిందా? హిందీ సినిమాలు, సిరీస్‌ల్లో నటించేందుకు రెడీ అవుతుందా? అంటే అవుననే అనిపిస్తోంది. ఈ విషయాన్ని తనే స్వయంగా చెప్పింది. తాజాగా ఓ ట్వీట్?తో ఈ విషయాన్ని ధృవీకరించింది. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. వివరాల్లోకి వెళితే.. రీసెంట్‌గా మంచు లక్ష్మీ మొన్న జరిగిన రకుల్ బర్త్ డే పార్టీలో సందడి చేసిన సంగతి తెలిసిందే. హీరోయిన్స్ ప్రగ్యా జైస్వాల్, రకుల్ ప్రీత్?తో కలిసి సరదాగా ఎంజాయ్ చేసింది. వారి బర్త్ డే పార్టీకి సంబంధించిన వీడియోలు, ఫోటోలు నెట్టింట్లో బాగానే ట్రెండ్ అయ్యాయి. ఇదే సమయంలో ఆమె ముంబయికి షిఫ్ట్ అయిందనే వార్తలు కూడా వచ్చాయి. త్వరలోనే మంచు లక్ష్మి హిందీ సినిమా, సిరీస్‌ల్లో నటించనుందని ప్రచారం సాగింది. అయితే తాజాగా ఈ విషయంపై మంచు లక్ష్మి స్పందించింది. "కొత్త నగరం, కొత్త యుగం. ఈ జీవితానికి చాలా కృతజ్ఞతలు. ఎప్పుడూ నన్ను ఆదరిస్తున్నందుకు, నన్ను విశ్వసిస్తున్నందుకు నా అభిమానులందరికీ ధన్యవాదాలు" అంటూ చెప్పుకొచ్చింది. ఈ ట్వీచ్ చూసిన నెటిజన్లు.. బాలీవుడ్?ను ఏలడానికి వెళ్ళావా అక్కా అని కొందరు కామెంట్లు చేస్తుంటే.. మరి కొందరు మంచు పేరు నిలబెట్టాలి అంటూ అభిప్రాయపడుతున్నారు. నీకు హిందీ వచ్చా అక్కా ఇప్పటి వరకు తెలుగు, ఇంగ్లీష్ కలిపిన యాసను విన్నాం.. ఇప్పుడు ఇంగ్లీష్ హిందీ మిక్స్ అయిన యాసను చూస్తామంటూ ఫన్నీగా కామెంట్లు పెడుతున్నారు. మరి మంచు లక్ష్మీ అక్కడ ఎలాంటి వెబ్ సిరీస్ లు,



సినిమాలు చేస్తుందో చూడాలి. కాగా, మంచు లక్ష్మీ చివరిసారిగా మాన్‌స్టర్ సినిమాలో నటించింది. ప్రస్తుతం ఆదిపర్వం సినిమాలో నటిస్తోంది. రీసెంట్‌గా ఫస్ట్ లుక్ కూడా వచ్చింది. 1990 మధ్యకాలంలో జరిగిన యధార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటున్నట్లుగా మేకర్స్ చెబుతున్నారు. చూడాలి మరి ఈ సినిమా ఎలా ఉంటుందో.. అలాగే హిందీలో ఆమెకు ఎలాంటి అవకాశాలు వస్తాయో... మకాం మార్చిన మంచు లక్ష్మి.. ఇకపై అక్కడే మంచు లక్ష్మీ హైదరాబాద్? నుంచి ముంబకి మకాం మార్చిందా? హిందీ సినిమాలు, సిరీస్‌ల్లో నటించేందుకు రెడీ అవుతుందా? అంటే అవుననే అనిపిస్తోంది. ఈ విషయాన్ని తనే స్వయంగా చెప్పింది. తాజాగా ఓ ట్వీట్?తో ఈ విషయాన్ని ధృవీకరించింది. ప్రస్తుతం ఈ ట్వీట్? నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. వివరాల్లోకి వెళితే.. రీసెంట్?గా మంచు లక్ష్మి మొన్న జరిగిన రకుల్ బర్త్ డే పార్టీలో సందడి చేసిన సంగతి తెలిసిందే. హీరోయిన్స్?? ప్రగ్యా జైస్వాల్, రకుల్ ప్రీత్?తో కలిసి సరదాగా ఎంజాయ్ చేసింది. వారి బర్త్ డే పార్టీకి సంబంధించిన వీడియోలు, ఫోటోలు నెట్టింట్లో బాగానే ట్రెండ్ అయ్యాయి. ఇదే సమయంలో ఆమె ముంబయికి షిఫ్ట్ అయిందనే వార్తలు కూడా వచ్చాయి. త్వరలోనే మంచు లక్ష్మి హిందీ సినిమా, సిరీస్?ల్లో నటించనుందని ప్రచారం సాగింది. అయితే తాజాగా ఈ విషయంపై మంచు లక్ష్మి స్పందించింది. "కొత్త నగరం, కొత్త యుగం. ఈ జీవితానికి చాలా కృతజ్ఞతలు. ఎప్పుడూ నన్ను ఆదరిస్తున్నందుకు, నన్ను విశ్వసిస్తున్నందుకు నా అభిమానులందరికీ ధన్యవాదాలు" అంటూ చెప్పుకొచ్చింది. ఈ ట్వీచ్ చూసిన నెటిజన్లు.. బాలీవుడ్?ను ఏలడానికి వెళ్ళావా అక్కా అని కొందరు కామెంట్లు చేస్తుంటే.. మరి కొందరు మంచు పేరు నిలబెట్టాలి అంటూ అభిప్రాయపడుతున్నారు. నీకు హిందీ వచ్చా అక్కా? ఇప్పటి వరకు తెలుగు, ఇంగ్లీష్ కలిపిన యాసను విన్నాం.. ఇప్పుడు ఇంగ్లీష్ హిందీ మిక్స్ అయిన యాసను చూస్తామంటూ ఫన్నీగా కామెంట్లు పెడుతున్నారు. మరి మంచు లక్ష్మీ అక్కడ ఎలాంటి వెబ్ సిరీస్ లు, సినిమాలు చేస్తుందో చూడాలి.. కాగా, మంచు లక్ష్మీ చివరిసారిగా మాన్‌స్టర్ సినిమాలో నటించింది. ప్రస్తుతం ఆదిపర్వం సినిమాలో నటిస్తోంది. రీసెంట్?గా ఫస్ట్ లుక్ కూడా వచ్చింది. 1990 మధ్యకాలంలో జరిగిన యధార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటున్నట్లుగా మేకర్స్ చెబుతున్నారు. చూడాలి మరి ఈ సినిమా ఎలా ఉంటుందో.. అలాగే హిందీలో ఆమెకు ఎలాంటి అవకాశాలు వస్తాయో...

## స్వీటీ అనుష్కని వదలనంటున్న క్రేజీ మేకర్స్

రెండేళ్ల విరామం తరువాత స్వీటీ అనుష్క నటించిన 'నిశ్శబ్దం' భారీ షాక్ ఇచ్చింది. మిస్టరీ థ్రిల్లర్‌గా హేమంత్ మధుకర్ రూపొందించిన ఈ సినిమాని పాన్ ఇండియా మూవీగా తెలుగుతో పాటు ఐదు భాషల్లో రిలీజ్ చేశారు. ఏ భాషలోనూ కనీసం యావరేజ్ టాక్‌ని కూడా దక్కించుకోలేకపోయింది. స్వీటీ భారీ అంచనాలు పెట్టుకుని చేసిన సినిమా డిజాస్టర్ కావడంతో మరో సినిమా కోసం దాదాపు మూడేళ్లు విరామం తీసుకుంది. ఫైనల్‌గా యువీ క్రియేషన్స్ వారికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. 'జాతిరత్నాలు' సినిమాతో సంచలన విజయాన్ని సొంతం చేసుకుని టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచినయంగ్ హీరో నవీన్ పొలిశెట్టితో కలిసి అనుష్క నటించిన రొమాంటిక్ కామెడీ 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. సెప్టెంబర్ 7న భారీ పోటీ మధ్య ప్రేక్షకుల ముందుకొచ్చింది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలైన ఈ సినిమా మంచి టాక్‌ని సొంతం చేసుకుంది. అయితే



ఓ పక్క తలైవా 'జైలర్' హవా, మరో పక్క షారుక్ ఖాన్ 'జవాన్' దూకుడు ముందు 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' తన ప్రభావాన్ని ఆశించిన స్థాయిలో చూపించలేకపోయింది. దీంతో అనుష్కకు మంచి బ్లాక్ బస్టర్‌ని అందించాలనే యువీ క్రియేషన్స్ వారి ప్లాన్ పూర్తి స్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. ప్రస్తుతం భారీ ప్రాజెక్ట్‌లని నిర్మిస్తూ..మరి కొన్ని పాన్ ఇండియా సినిమాలకు నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తున్న యువీ మరోసారి స్వీటీ కోసం రంగంలోకి దిగుతోంది. సూర్య హీరోగా జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న 'కంగువ' చిత్రానికి, వైఎస్ జగన్ బయోపిక్ ఆధారంగా రూపొందుతున్న 'యాత్ర 2'కు యువీ నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తోంది. దీనితో పాటు మరికొన్ని క్రేజీ సినిమాలు చేస్తోంది. వీటితో బిజీగా ఉన్నా అనుష్కతో మరో సినిమాకు శ్రీకారం చుట్టబోతోందని తెలిసింది. ఈ ప్రాజెక్ట్ కోసం కొత్త కథలని అన్వేషిస్తోంది. అంతే కాకుండా అనుష్క ప్రధాన పాత్రలో కథ ఉండేలా కొత్త దర్శకులని వెతుకుతోంది. 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'ని కూడా అనుష్క ప్రధానంగానే నిర్మించిన యువీ మరో సారి అదే పంథాలో సాగే కథని అనుష్క కోసం అన్వేషిస్తుండంతో యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్స్ స్క్రిప్ట్‌లు పట్టుకుని యువీ ఆఫీస్ చుట్టూ తిరగడం మొదలు పెట్టారట.





# దసరాకి టీజర్స్, ట్రైలర్స్ జోరు




ఈ దసరాకి నాలుగు భాషల నుంచి ఐదు సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. కన్నడం నుంచి శివరాజ్ కుమార్ ఘోస్ట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా రిలీజ్ కాబోతోంది. కోలీవుడ్ నుంచి లియో మూవీ రెడీ అవుతోంది. బాలీవుడ్ నుంచి గణపత్ మూవీ రాబోతోంది. ఇక తెలుగు నుంచి భగవంత్ కేసరి, రవితేజ టైగర్ నాగేశ్వరరావు మూవీస్ థియేటర్స్ లో సందడి చేయబోతున్నాయి. దీంతో ఆడియన్స్ ని కావాల్సినంత సినిమా సందడి దసరా సెలవుల్లో ఉండబోతోంది. అయితే ఈ సినిమాల సంగతి అలా ఉంటే త్వరలో రిలీజ్ కాబోయే సినిమాలకి సంబందించిన టీజర్స్, ట్రైలర్స్ కూడా దసరా సర్ప్రైజ్ గా రాబోతున్నాయి. వాటిలో నేచురల్ స్టార్ నాని హాయ్ నాన్న టీజర్, విక్టరీ వెంకటేష్ పాన్ ఇండియా మూవీ సైంధవ్ టీజర్ రిలీజ్ కాబోతున్నాయి. బాలీవుడ్ నుంచి యష్ రాజ్ స్పై సిరీస్ లో వస్తోన్న టైగర్ 3 మూవీ దీపావళికి రిలీజ్ కాబోతోంది. సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్ లీడ్ చేసిన ఈ మూవీ టీజర్ ని దసరా కానుకగా అందించబోతున్నారు. అలాగే దిల్ రాజు బ్యానర్ లో పరశురాం దర్శకత్వంలో విజయ్ దేవరకొండ చేస్తోన్న ఫ్యామిలీ స్టార్ మూవీ టైటిల్ లాంచ్ టీజర్ రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. అలాగే గేమ్ చేంజర్ నుంచి ఫస్ట్ సింగిల్ కూడా దసరాకి రాబోతోంది. సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ ని దసరాకి లాంచ్ చేయబోతున్నారని టాక్. ఇలా దసరాకి సినిమా వినోదంగా ఆడియన్స్ కి కావాల్సినంత లభిస్తోంది. వీటితో పాటు ఒటీటీలో కూడా దసరా కానుకగా చాలా కొత్త సినిమాలు రాబోతున్నాయి. మరి వీటిలో ఏవి ఆడియన్స్ ని ఎంటర్టైన్ చేస్తాయనేది వేచి చూడాలి. మూవీస్ పరంగా చూసుకుంటే దేనికవే ప్రత్యేకమైనవి. అన్నింటి మీద పాజిటివ్ వైబ్ నడుస్తోంది. లియో, భగవంత్ కేసరి, టైగర్ నాగేశ్వరరావు చిత్రాలలో ఒకటి మాత్రం ఆడియన్స్ ని బలంగా ఎట్రాక్ట్ చేసే అవకాశం ఉంది.

# టైగర్ కోసం ఎప్పుడు లేనంత కష్టం!




మాస్ మహారాజ్ రవితేజ హీరోగా వంశీకృష్ణ ఆకెళ్ళ దర్శకత్వంలో తెరకెక్కి రిలీజ్ కి సిద్ధమవుతోన్న మూవీ టైగర్ నాగేశ్వరరావు. భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా చిత్రంగా దీనిని ఐదు భాషలలో ప్రేక్షకుల ముందుకి తీసుకొస్తున్నారు. అనుపమ్ ఖేర్ లాంటి బాలీవుడ్ స్టార్ ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపిస్తున్నారు. అలాగే నుపూర్ సనన్, గాయత్రి భరద్వాజ్ ఈ చిత్రంలో హీరోయిన్స్ గా నటించారు. తాజాగా రిలీజ్ అయిన ట్రైలర్ సినిమాపై హైప్ క్రియేట్ చేసింది. రవితేజ కెరియర్ లోనే భారీ బడ్జెట్ తో తెరకెక్కిన సినిమా కావడంతో మూవీకి మరింత హైప్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మాస్ మహారాజ్ రవితేజ ప్రమోషన్స్ ని తన భుజాలపై వేసుకొని గట్టిగా చేస్తున్నారు. ఇప్పటి వరకు ఏ సినిమాకి చేయని స్థాయిలో టైగర్ నాగేశ్వరరావు మూవీ కోసం రవితేజ ప్రమోషన్స్ చేస్తూ ఉండటం విశేషం. టైగర్ నాగేశ్వరరావు ప్రమోషన్స్ లో భాగంగా వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్ లకి కామెంటేటర్ గా కూడా రవితేజ మారిపోయారు. తెలుగు హీరోలలో ఇలా క్రికెట్ మ్యాచ్ లలో ప్రమోషన్స్ చేసిన మొదటి స్టార్ గా రవితేజ నిలిచారు. నార్త్ ఇండియాలో కూడా సినిమాని గట్టిగా ప్రమోట్ చేయాలని అనుకుంటున్నారు. దానికోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ది కాశ్మీర్ ఫైల్స్, కార్తికేయ 2 సినిమాతో పాన్ ఇండియా లెవల్ లో అభిషేక్ 'అగర్వాల్ పిక్చర్స్ సూపర్ హిట్ కొట్టారు. ఇప్పుడు టైగర్ నాగేశ్వరరావుతో మరో సూపర్ సక్సెస్ ని పాన్ ఇండియా స్థాయిలో అందుకోవాలని అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే మూవీ ప్రమోషన్స్ కోసం నిర్మాతలు కూడా కోట్ల రూపాయిలు ఖర్చు చేస్తున్నారు. హీరోయిన్స్ కూడా ప్రమోషన్స్ కోసం తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. అయితే మెజారిటీ బాద్యత అంతా రవితేజ తీసుకుంటున్నారు.ప్రమోషన్స్ లో భాగంగా ఇండియాలో అతిపెద్ద రియాలిటీ షో ఇండియన్ గాట్ టాలెంట్ షోలో రవితేజ పాల్గొన్నారు. దీనికి సంబందించిన ఎపిసోడ్ త్వరలో ప్రారంభం కానుదంట. సినిమాపై ప్రస్తుతానికి పాజిటివ్ బజ్ ఉంది. దసరా బరిలో రెండు పెద్ద సినిమాలతో పోటీ పడుతున్న టైగర్ నాగేశ్వరరావు ఎలాంటి రిజల్ట్ అందిస్తుందనేది వేచి చూడాలి. ఈ మూవీ సూపర్ హిట్ అయితే మాత్రం పాన్ ఇండియా లెవల్ లో రవితేజ పేరు గట్టిగా వినిపించే అవకాశం ఉంది.

## 200 మందిని వెనక్కి నెట్టి నేనొచ్చా!

కృతిసనన్ సోదరి నుపుర్ సనన్ టైగర్ నాగేశ్వరరావు తో టాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తోంది. అక్క తరహాలోనే అమ్మడి ప్రవేశం జరుగుతుంది. హిందీలో ఓ సినిమా చేస్తోన్న తెలుగులోనే నుపుర్ తొలి చిత్రం టైగర్ రిలీజ్ అవుతుంది. కృతిసనన్ కెరీర్ కూడా ఇలాగే లాంచ్ అయింది. హిందీ 'హీరో పంటీ' సినిమా చేస్తోన్న సమయంలోనే వన్ లో అవకాశం రావడం..అది రిలీజ్ అవ్వడం ముందుగా జరిగాయి. టైగర్ నాగేశ్వరరావు లో మాస్ రాజాతో నుపుర్ ఆడిపాడనుంది. అయితే ఈ ఛాన్స్ అమ్మడికి రావడం చాలా లక్కీ అనే తెలుస్తోంది. ఆ పాత్ర కోసం దర్శకుడు 200మందిని చూసారుట. చివరిగా నిన్ను చూసాక నువ్వు అయితేనే బాగుంటుందని దర్శకుడు వంశీ నిర్ణయంతో ఆ ఛాన్స్ నుపుర్ కి వరించినట్లు తెలిపింది. ఓ



ప్రాజెక్ట్ విషయంలో ఇంతకు మించి ఇంకే కావాలని సంతోషం వ్యక్తం చేసింది. నిజమే 200 మందిని దాటి అవకాశం నుపుర్ కి రావడం అంటే లక్ ఉన్నట్లే గా. అందుకే ఇండస్ట్రీలో అదృష్టం కూడా కలిసి రావాలి అంటారు. ఇక అక్కతో నుపుర్ చాలా స్నేహగా ఉంటుందిట. మార్నింగ్ కాపీ టైమ్ లో సినిమా ముచ్చట్లే నడుస్తా యట. కృతి ఎలాంటి పాత్ర చేసినా నచ్చకపోతే నిర్మొహమాటంగా చెప్పేస్తుందిట నుపుర్. ఇప్పుడు నుపుర్ టైమ్ వచ్చింది కాబట్టి కొన్నాళ్ల పాటు అక్కతో కలిసి కాపీ తాగడం మానేస్తే బెటర్ అనిపిస్తుందని నవ్వేసింది. నిజమే కదా! లేకపోతే కృతికి అడ్డంగా నుపుర్ దొరికినట్లే. ఎన్నో ఆశలతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తోన్న అమ్మడిని ఇప్పుడు రివర్స్ లే ఆడేసుకోదు. ఇక రవితేజ తో ఆన్స్ సెట్స్ లో నుపుర్ తో హిందీలో మాట్లాడేవారుట. ఆ రకంగా సెట్స్ లో భాష పరంగా ఇబ్బంది తలెత్తదని తెలిపింది. హిదీలో డబ్ అయిన రవతేజ సినిమాలన్నీచూసేసిందిట. మాస్ రాజా అన్నది ఆయనకి తగ్గ పేరు అంది. తెలుగులో రామ్ చరణ్ ..నాని..విశ్వక్ సేన్ నటన అంటే ఇష్టమట. కీర్తిసురేష్.. సాయిపల్లవి లేడీ ఓరియేంటెడ్ చిత్రాల్లో ఒదిగిన విధానం నచ్చిందిట.

## అయిదు పదులు దాటిన ఎల్లోర శిల్పం

హైదరాబాద్ లో పుట్టి తెలుగు సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయం అయి తక్కువ సమయంలోనే బాలీవుడ్ కు వెళ్లిన ముద్దుగుమ్మ టబు. నటి ఫరాహ్ చెల్లెలు అయిన ఈమె దివంగత హీరోయిన్ దివ్య భారతికి ప్రాణ స్నేహితురాలిగా టాక్. దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు టబును కూలీ నెం.1 సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేయడం జరిగింది. మూడున్నర దశాబ్దాలుగా సినీ కెరీర్ ను కొనసాగిస్తున్న ముద్దుగుమ్మ టబు. తెలుగు లో కొన్నే సినిమాలు చేసినా కూడా ఎక్కువగా ఉత్తరాది ప్రేక్షకులను అలరించే విధంగా బాలీవుడ్ సినిమాలను చేసింది. హీరోయిన్ గా సుదీర్ఘమైన కెరీర్ ను కలిగి ఉన్న టబు ఇంకా కూడా హీరోయిన్ గానే వెలుగు వెలుగుతున్న విషయం తెల్సిందే. అయిదు పదుల వయసు దాటినా కూడా టబు అందం ఏమాత్రం తగ్గ లేదు. అందుకే హీరోయిన్ గా ఇంకా కూడా



అందాల ఆరబోత చేస్తూ కన్నుల విందు చేస్తోంది. బాబోయ్ ఏంటి ఈ అందాల రచ్చ అంటూ చాలా మంది అభిమానులు సోషల్ మీడియాలో టబు ఫోటోలు చూసిన ప్రతి సారి అనుకుంటూనే ఉంటారు. తాజాగా టబు నెట్ ఫ్లిక్స్ ఓటీటీ కోసం ఖుఫియా అనే సిరీస్ ని చేసింది. ఆ సిరీస్ ప్రమోషన్ లో భాగంగా ఇలా అందాల ఆరబోత ఫోటో షూట్ తో రెచ్చి పోయింది. నిజంగా ఈమె వయసు అయిదు పదులా అనిపించే విధంగా ఈ ఫోటోల్లో టబు కనిపిస్తుంది. అయిదు పదుల వయసులోనూ మూడు పదుల వయసు ముద్దుగుమ్మ గా కనిపిస్తున్న టబు ఈ బ్లాక్ డ్రెస్ లో ఎల్లోర శిల్పం మాదిరిగా ఫోజ్ ఇస్తే నిజంగా ఎల్లోరా శిల్పమేనా అన్నట్లుగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ముందు ముందు మరిన్ని బాలీవుడ్ సినిమాలు, సిరీస్ లతో పాటు సౌత్ లో ముఖ్యంగా తెలుగు సినిమాల్లో టబు నటించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

# గరుడ వార్త






## సీఎం కేసీఆర్ సూచన మేరకు పొన్నాలను భారాసలోకి ఆహ్వానించాం: కేటీఆర్

హైదరాబాద్: సీనియర్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యకు భారాస నుంచి ఆహ్వానం అందింది. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన పొన్నాల లక్ష్మయ్య ఇంటికి శనివారం భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వెళ్లి.. పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, దాసోజు శ్రవణ్‌తో కేటీఆర్.. హైదరాబాద్‌లోని పొన్నాల నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా పొన్నాల నివాసం వద్దకు ఆయన మద్దతుదారులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. జనగామ గడ్డ.. పొన్నాల అడ్డా అంటూ నినాదాలు చేశారు.

**పొన్నాలకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తాం: మంత్రి కేటీఆర్ –** మాజీ మంత్రి పొన్నాలతో భేటీ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి పీసీసీ అధ్యక్షుడు, సీనియర్ రాజకీయ వేత్త పొన్నాల లక్ష్మయ్యను సీఎం కేసీఆర్ సూచన మేరకు భారాసలోకి ఆహ్వానించాం. పొన్నాల ఆదివారం సీఎం కేసీఆర్‌ను కలుస్తారు. జనగామలో జరిగే బహిరంగ సభలో భారాసలో చేరాలని కోరగా సుముఖత వ్యక్తం చేశారు. ఆదివారం సీఎంతో మాట్లాడిన తర్వాత తన నిర్ణయం ప్రకటిస్తానని పొన్నాల చెప్పారు. బలహీనవర్గాలకు చెందిన అనేక మంది నాయకులకు ఇప్పటికే సీఎం కేసీఆర్ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. పొన్నాల లక్ష్మయ్యకు పార్టీలో సముచిత గౌరవం, ప్రాధాన్యం ఇస్తామని సీఎం చెప్పారు. 1960లోనే అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేసి.. నాసా లాంటి అంతర్జాతీయ సంస్థల్లో ఇంజినీర్‌గా పనిచేసిన వ్యక్తి పొన్నాల. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరి సుదీర్ఘకాలం పాటు ప్రజాసేవ చేశారు" అని మంత్రి కేటీఆర్ అన్నారు.

**రేవంత్‌రెడ్డి ఎన్ని పార్టీలు మారలేదు..** "వయసులో పెద్ద, అనుభవంలో పెద్ద, బలహీన వర్గాలకు చెందిన సీనియర్ నాయకుడిని పట్టుకుని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తూలనాడిన విధానం దిగజారుడు సంస్కారానికి నిదర్శనం. చచ్చే ముందు పార్టీ మారడం అనడమేంది? ఎవరు ఎప్పుడు చనిపోతారో ఎవరికి తెలుసు? ఇది మంచి పద్ధతి కాదు. ఆ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి ఎన్ని పార్టీలు మారాడు? మొదట భాజపా- ఆర్ఎస్ఎస్, తర్వాత టీఆర్ఎస్, ఆ తర్వాత తెలుగుదేశం, ఇప్పుడు కాంగ్రెస్.. రేపు.. ఏ పార్టీలోకి వెళ్తారో ఎవరికీ తెలియదు. అలాంటి వ్యక్తి కూడా పెద్ద పెద్ద మాటలు మాట్లాడితే చూసే వాళ్లు నవ్వుకుంటున్నారు. కనకపు సింహాసనంపై ఓటుకు నోటు కేసు దొంగను కూర్చోబెట్టారు. కాంగ్రెస్ పార్టీ.. సీనియర్ నేతలకు కనీసం అపాయింట్ మెంట్, గౌరవం కూడా ఇవ్వడంలేదు" అని మంత్రి కేటీఆర్ విమర్శించారు.




## గెలిచేది కాంగ్రెస్సే కానీ.. నా ప్లాన్ మాత్రం ఇదే!

హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు ధీమా వ్యక్తం చేశారు. తనకు సీఎం కుర్చీపై ఆశ లేదని, ఎమ్మెల్యేగా పోటీ చేయనని, ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని పేర్కొన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గం ప్రజలు ఎంపీగా పోటీ చేయాలని కోరుతున్నారని, అందుకే వచ్చే ఎన్నికల్లో అక్కడినుంచి బరిలోకి దిగుతున్నట్లు తెలిపారు. బీసీలకు 33 శాతం టిక్కెట్లు కేటాయించాలని ఇప్పటికే పార్టీ అధిష్టానానికి విన్నవించానని, బీసీలను విస్మరిస్తే పార్టీకి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్ పేరును ప్రతిపాదించానని, ఆయనకే టిక్కెట్ వస్తుందని, ముందుండి గెలిపించుకుంటానని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయని, కర్నాటక ఫలితాలే తెలంగాణలో పునరావృతమవుతాయని ఆయన స్పష్టం చేశారు.

## హైదరాబాద్ విద్యార్థిని ప్రవళిక ఆత్మహత్యపై ఖర్గే ఏమన్నారంటే...



న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో విద్యార్థిని ప్రవళిక ఆత్మహత్యను కాంగ్రెస్ అగ్ర నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. హైదరాబాద్‌లో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అనగా.. తాజాగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ ఘటనపై స్పందించారు.

తెలంగాణలో 23 ఏళ్ల విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం దిగ్భ్రాంతికి తీవ్ర వేదనకు గురిచేసిందని అన్నారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలను పదేపదే వాయిదా వేయడం అవకతవకల కారణంగా తన జీవితాన్ని అంతం చేసుకుందని తెలిపారు. ప్రవళిక కుటుంబానికి ఖర్గే సంతాపం తెలిపారు. పరీక్షల నిర్వహణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉదాసీనత కారణంగా తెలంగాణలోని వేలాది మంది యువ ఔత్సాహికులు నిరాశ, కోపంతో ఉన్నారన్నారు. తెలంగాణ యువకులు అవినీతి, పనికిమాలిన అసమర్థమైన బీఆర్ఎస్‌ను అధికారం నుంచి తరిమికొడతారని మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు చేశారు.

## ప్రవళిక మృతిపై 48 గంటల్లో నివేదిక ఇవ్వండి: గవర్నర్

హైదరాబాద్: గ్రూప్-2 అభ్యర్థిని ప్రవళిక (23) ఆత్మహత్యపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్పందించారు. ఆమె మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రవళిక మృతిపై 48 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని సీఎస్, డీజీపీ, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శిని గవర్నర్ ఆదేశించారు.

**ప్రవళికది ఆత్మహత్య కాదు.. హత్యే: రాహుల్ –** ప్రవళిక ఆత్మహత్య ఘటన చాలా బాధ కలిగించిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. "ప్రవళికది ఆత్మహత్య కాదు.. హత్యే. తెలంగాణ యువత నిరుద్యోగంతో విలవిలలాడుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే జాబ్ క్యాలెండర్ వస్తుంది.

మేం అధికారంలోకి వచ్చాక యూపీఎస్సీ తరహాలోనే టీఎస్‌పీఎస్సీని బలోపేతం చేస్తాం. అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం" అని రాహుల్ పేర్కొన్నారు.

**గ్రూప్-2 అభ్యర్థిని ఆత్మహత్య :** వరంగల్ జిల్లా బిక్కాజిపల్లికి చెందిన మర్రి ప్రవళిక (23) అశోక్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ గ్రూప్-2 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. శుక్రవారం సాయంత్రం హాస్టల్‌లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థులు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా... అప్పటికే అక్కడికి పెద్ద ఎత్తున చేరుకున్న అభ్యర్థులు అడ్డుకున్నారు. పరీక్ష వాయిదా పడడం వల్లే మనస్తాపంతో ఆమె ఆత్మహత్య చేసుకుందన్నారు. అర్ధరాత్రి వరకు మృతదేహం హాస్టల్‌లోనే ఉంది.



రాత్రి 1.30 ప్రాంతంలో ప్రవళిక మృతదేహాన్ని పోలీసులు అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు.

అక్కడి నుంచి ఎట్టకేలకు ప్రవళిక స్వగ్రామానికి మృతదేహాన్ని ఇవాళ తరలించారు. ప్రవళిక మృతితో బిక్కాజిపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## సెంటిమెంట్‌గా ఉన్న హుస్నాబాద్‌ను ఎందుకు అభివృద్ధి చేయాలేదు.. కేసీఆర్‌కు పొన్నం ప్రశ్న

సిద్దిపేట: ఎన్నికల సెంటిమెంట్ కోసం హుస్నాబాద్‌ను వాడుకుంటున్న సీఎం కేసీఆర్ సెంటిమెంట్‌కు సమానంగా హుస్నాబాద్‌ను ఎందుకు అభివృద్ధి చేయలేదని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 2014కు ముందే 70% పూర్తయిన గౌరవెల్లి ప్రాజెక్టును కూర్చీ వేసుకుని పూర్తి చేస్తానన్న సీఎం కేసీఆర్ ఇంతవరకు ఎందుకు పూర్తి చేయలేదో బహిరంగ సభలో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసుల నిర్బంధాల మధ్య భూ నిర్వాసితులను అణిచివేసి కూడా గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయలేదన్నారు. సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల లాగా హుస్నాబాద్‌ను ఎందుకు అభివృద్ధి చేయలేదో సీఎం కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. పొత్తుల్లో భాగంగా గత ఎన్నికల్లో హుస్నాబాద్ అసెంబ్లీ స్థానం సీపీఐకి కేటాయించామని.. ఈ ఎన్నికల్లో మాత్రం హుస్నాబాద్‌ను కాంగ్రెస్‌కు వదిలిపెట్టాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొని ప్రజలను మభ్యపెట్టడానికి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ రాజకీయ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు.



తమ మేనిఫెస్టో దిమ్మ తిరిగేలా ఉంటుందంటున్న బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో ఇదివరకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు దిమ్మ తిరిగే తీర్పిస్తారని అన్నారు. బీఆర్ఎస్ తాయిలాలు తీసుకొని ఎన్నికల్లో మాత్రం ఓటుతో ప్రజలు మార్పుకు పట్టం కట్టాలని కోరారు. నిరుద్యోగి ప్రవళిక ఆత్మహత్య టీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వ హత్యే అని పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు చేశారు.

## అమ్మా ప్రవళిక... కన్నవారి కళ్లలో ఆనందం చూడాలన్న సంగతి మరిచావా?: రేవంత్ ట్వీట్

హైదరాబాద్: గ్రూప్-2 అభ్యర్థి ప్రవళిక ఆత్మహత్యపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మా ప్రవళిక మరికొంత ఆత్మస్థైర్యాన్ని కూడదీసుకోలేకపోయావా అంటూ టీపీసీసీచీఫ్ భావోద్వేగంగా ట్వీట్ చేశారు. "ఎన్నో అగ్ని పరీక్షలు ఎదుర్కొని ఇంత దూరం వచ్చిన దానివి.. మరికొంత ఆత్మస్థైర్యాన్ని కూడదీసుకోలేకపోయావా? నువ్వు కన్న కలల కోసం మరికొన్నాళ్లు వేచి ఉండలేకపోయావా? నిన్ను కన్నవారి కళ్లల్లో ఆనందం చూడాలన్న సంగతిని మరిచిపోయావా? ఎంతోమందికి దారి చూపాలనుకున్నదానివి.. ఇలా అర్ధాంతరంగా నీ ప్రయాణం ముగిస్తావా? భగవంతుడు నీ ఆత్మకు శాంతిని చేకూర్చాలని ప్రార్థిస్తూ.. యువతీ, యువకుల్లారా! ఆత్మహత్యలు వద్దు.. మీ ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దు! మన భవిష్యత్తుతో చెలగాటం ఆడిన ఈ నక్కలు ఎక్కడ



నక్కినా గుంజుకొచ్చి దోషులుగా నిలబెడదాం. వీళ్ళ నక్క జిత్తులను నడి రోడ్డులో నిలబెట్టి తరిమికొడదాం" అంటూ రేవంత్ ట్వీట్ చేశారు.

## నేటి నుంచి భద్రాద్రి రామయ్య సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు



భద్రాచలం : భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ సన్నిధిలో ఈ నెల 15 నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభిస్తున్నట్లు ఆలయ ఈవో రమాదేవి ప్రకటించారు. తొలిరోజు అమ్మవారు ఆదిలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కలిగించనున్నారు. 16న సంతానలక్ష్మి, 17న గజలక్ష్మి, 18న ధనలక్ష్మి, 19న ధాన్యలక్ష్మి, 20న విజయలక్ష్మి, 21న ఐశ్వర్యలక్ష్మి, 22న వీరలక్ష్మి, 23న మహాలక్ష్మి, 24 (విజయదశమి)న నిజరూపలక్ష్మిగా భక్తులకు దర్శనమిస్తారు. ఇదేరోజున ఆలయ అర్చకులు సంక్షేప రామాయణ హవన పూర్ణాహుతి, మహా పట్టాభిషేకం, విజయోత్సవం, శమీ పూజ, ఆయుధ పూజ, శ్రీరామ లీలా మహోత్సవం నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల పాటు భక్తులు శ్రీమద్రామాయణ పారాయణం పఠించనున్నారు. దశమి రోజున పట్టాభిషేకం, సంక్షేప రామాయణ హవనం చేయించుకునేందుకు ఆలయ అధికారులు భక్తులకు అవకాశం ఇచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ 3:30 నుంచి 4:30 గంటల వరకు జరిగే కుంకుమార్చనలో మహిళా భక్తులు పాల్గొనవచ్చు. ఏర్పాట్లను ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఈఈ రవీందర్ రాజు పర్యవేక్షించనున్నారు.

దేవస్థాన ఆస్థాన స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఆలయ ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి.

**28న శబరి స్మృతియాత్ర :** అక్టోబర్ 28 ఆశ్వయుజ శుద్ధ పూర్ణిమ రోజు సందర్భంగా భద్రాద్రి ఆలయ సన్నిధిలో ఆలయ అధికారులు, అర్చకులు 'శబరి స్మృతియాత్ర' నిర్వహించనున్నారు. ఇదే రోజు పాక్షిక చంద్రగ్రహణం కారణంగా అర్చకులు సాయంత్రమే ఆరాధన, దర్బార్ సేవ, చుట్టు సేవను పూర్తి చేసి ఆలయ కవాట బంధనం (ఆలయ తలుపులు మూయడం) చేస్తారు. 29వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు తిరిగి ఆలయ తలుపులు తెరుస్తారు. ఆలయ సంప్రోక్షణ చేస్తారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కలిగిస్తారు.

## ప్రవళిక ఆత్మహత్యపై రేవంత్ ట్వీట్‌కు ఎమ్మెల్సీ కవిత కౌంటర్



హైదరాబాద్: విద్యార్థిని ప్రవళిక ఆత్మహత్యపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ట్విట్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కవిత కౌంటర్ ఇచ్చారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. "బతుకమ్మ చేస్తాము.. బాధను కూడా పంచుకుంటాము.. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను కించపరచడం ఒక కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యం... ఆడబిడ్డ ఆత్మహత్య చేసుకుంటే సానుభూతి వ్యక్తం చేయడం పోయి రాజకీయం చేయడం మీ విధానమా? ప్రవళిక ఆత్మహత్య చేసుకోవడం విచారకరం. ఏ తల్లిదండ్రులకు ఇలాంటి పరిస్థితి రాకూడదు.. నోటిఫికేషన్లకు మోకాలడ్డుతూ నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నదే కాంగ్రెస్ పార్టీ. తెలంగాణలో ఏ ఒక్క ఉద్యోగం నోటిఫికేషన్ జారీ అయినా దాన్ని అడ్డుకోవడానికి కాంగ్రెస్ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేసింది వాస్తవం కాదా? మీ కుట్రలకు బద్దలు కొట్టి లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత సీఎం కేసీఆర్ గారిది.

చివరికి గ్రూప్ -2ను వాయిదా వేయాలని మీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ బాబు అసెంబ్లీలో డిమాండ్ చేయడమే కాకుండా మీరు కూడా డిమాండ్ చేయలేదా? శవాల మీద పేలాలు ఏరుకోవడం మీకు, మీ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. హత్య చేసిన వాళ్లే ఓదార్చుతున్నట్లు ఉంది మీ వ్యవహార శైలి. మీ ఆవేదన బూటకం... మీ ఆందోళన నాటకం" అంటూ కవిత ట్వీట్ చేశారు.

## పూలను పూజించి.. ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ: మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలకు.. ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని మంత్రి హరీశ్ రావు అన్నారు. పూలపండుగను ప్రజలందరు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.


పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని చెప్పారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో జరుపుకునే ఈ గొప్ప పండుగ సందర్భంగా ఆడబిడ్డలందరికి బతుకమ్మ పండగ శుభాకాంక్షలు తెలిపారు.



## ఎమ్మెల్యే సీతక్క సంచలన కామెంట్స్.. నేను గెలిచినందునే ములుగు జిల్లా అయింది

ములుగు: నేను గెలిచాను కాబట్టే ములుగును జిల్లా చేశారు... నేను పోరాటం చేసినందుకే అభివృద్ధి నిధులు ఇచ్చారని... రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ములుగు జిల్లాను శాశ్వతంగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు మండలంలోని జంగాలపల్లిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆమె పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలే నా కుటుం బమని, నా కుటుంబంలో చావైనా, బతుకైనా, శుభకార్యాలైనా పిలుస్తు న్నారని, ఒక ఆడబిడ్డగా నేను వస్తే ఓర్చుకోలేని బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాపై దుష్ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. నా గెలుపు వల్ల ములుగు జిల్లా అయిందని, నేను అడిగితేనే ములుగులో సమీకృత కలెక్టరేట్, హెల్త్ ప్రొఫైల్, మెడికల్ కళాశాల, మల్లంపల్లి మండలం, ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ అయిందని, పోడు భూములకు పట్టాల జారీ జరిగిందని అన్నారు. ఒక ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజల పక్షాన ఉంటూ పోరాడుతూనే ఉన్నానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దీంతో ములుగు జిల్లాను రాష్ట్రంలోనే అత్యాధునికంగా అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. గోదావరి జలాలను జిల్లాలోని చెరువులకు మళ్లించి సాగునీటి కష్టాలను తొలగిస్తానని పేర్కొన్నారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళిరెడ్డి, నాయకులు మల్లాడి రాంరెడ్డి, చల్లా నారాయణరెడ్డి, నామా కరంచంద్‌గాంధీ, పుష్పలత, గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, బానోత్ రవిచందర్, వంగ రవి యాదవ్, దాసరి సుధాకర్, అయూబ్‌ఖాన్, కంబాల రవి, జగన్మోహన్ రెడ్డి, ఇర్సవడ్ల వెంకన్న, భగవాన్‌రెడ్డి, సత్తిరెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతో మంతనాలు జరుపుతున్నాం



మంచిర్యాల: ఏ ఎన్నికల్లోనైనా వామపక్ష పార్టీలు ప్రజా ఏజెండాను అమలు చేస్తాయని సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం నాడు సీపీఐ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "కేసీఆర్ వామపక్షాలను వాడుకుని మోసం చేశారు. ఏక పక్షంగా కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీతో మంతనాలు జరుపుతున్నాం. బెల్లంపల్లి, హుస్నాబాద్, మునుగోడు, కొత్తగూడెం, వైరా అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని ప్రతిపాదించాం. ఒకటి, రెండు రోజుల్లో సర్దు బాటు కొలిక్కి వస్తుంది. సంక్షేమ పథకాల పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోంది. చట్టాలను చుట్టాలుగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కింది.

పోటీ పరీక్షలను వాయిదా వేస్తూ నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ ఆడుకుంటున్నారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. ఇండియా కూటమి సంచలన విజయం సాధించబోతోంది" అని చాడ వెంకటెడ్డి పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com